

కళ్యాణం కమనీయం



పెండ్లిమండపం వద్ద వధూవరుల అలంకరణలో ఆది దంపతులు



అశేషభక్త జనం మధ్య కల్యాణోత్సవ పూజలు

- ఆది దంపతుల వివాహ వేడుకలతో శోభిల్లిన శ్రీకాళహస్తి క్షేత్రం
- అదే ముహూర్తాన ఒక్కటైన 30 జంటలు



వధూవరులకు వస్త్రాలందజేస్తున్న ముక్కంటి ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 11: గజవాహనంపై వరుడిగా శివయ్య ... సింహవాహనంపై సిగ్గులొలుకుతూ పార్వతమ్మ కల్యాణోత్సవ వైభవంతో శ్రీకాళహస్తి క్షేత్రం పరవశించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్కందరాత్రిని పురస్కరించుకుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు... మేళ తాళాలు... కళాకారుల ఆటపాటల మధ్య ఆదివారం అర్ధరాత్రి వివాహ వేదిక వద్దకు కోలాహలంగా తీసుకువచ్చారు. చతుర్వేద పారాయణం పూర్తయ్యాక సప్తపది కార్యక్రమం ఆగమోక్తంగా ప్రారంభమైంది. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్ గురుకుల్ సారథ్యంలో సప్తపది విశేషోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. స్కందుడి జననం కోసం నిర్వహించిన కళ్యాణోత్సవ ఘట్టంలో చండికేశ్వర రాయబార పర్వం రక్తికట్టించింది. హిమవంతుడి కుమార్తె అయిన పార్వతీదేవికి, పరమేశ్వరుడికి పరిణయం నిశ్చయం చేసేందుకు బ్రహ్మ, విష్ణువులతో పాటు ఇంద్రాది సకల దేవతలు తరలివచ్చారు. జగద్రక్షకుడైన స్వామివారు చిటికెడు విభూది, ఒక్క బిల్వపత్రం కట్నంగా ఇచ్చేలా రాయబారం కొనసాగింది. ఉదయం 5 గంటల సమయంలో మాంగల్యధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఇదే ముహూర్తంలో 30 జంటలు పెండ్లి మండపం వద్ద వివాహంతో ఒక్కటయ్యాయి. అంతకు ముందు వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు,పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వీక్షించేందుకు వచ్చిన భక్త జనంతో నగిరి వీధి, నెహ్రూ వీధి నిండిపోయాయి. అనంతరం ఆది దంపతులు నారద పుష్కరిణి, విజ్ఞానగిరి, ఆ తరువాత పురవీధుల్లో ఊరేగి భక్తులకు నవ దంపతులుగా దర్శమిచ్చారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పూర్వ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం... నటరాజ కల్యాణోత్సవం

సకల శాస్త్రాలకు ఆదిగురువైన నటరాజు, శివకామ సుందరి పరిణయోత్సవం సోమవారం రాత్రి ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శివకామ సుందరి సమేత నటరాజస్వామికి జరిపిన



మాంగల్యం చూపుతున్న ప్రధాన అర్చకుడు

ఈ కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాది కార్యక్రమాలు జరిపారు. చివరిగా యాగకలశంలోని పవిత్రజలంతో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాలమధ్య ప్రధాన అర్చకులు మాంగల్యధారణ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.సోమవారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు.

అన్ని పార్టీల్లో అస్పష్టతే!

అభ్యర్థులెవరో తెలియక అయోమయంలో శ్రేణులు

ఆరు పూర్తిగా, మరో రెండు పాక్షికంగా... వెరసి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. పొత్తులో భాగంగా టీడీపీ ఏడింటిని ఎంచుకోగా నాలుగు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక ఖరారు కాలేదు. జనసేనకు కేటాయించిన ఏకైక సీటులోనూ అభ్యర్థి ఎవరన్నది తేలడం లేదు. ఈ రెండు పార్టీలతో పొత్తు బంధంలోకి వచ్చిన బీజేపీ ఏ స్థానం కోరుతుందో తెలియడం లేదు. అధికారంలో వున్నందున అభ్యర్థుల ఎంపికలో అందరికంటే ముందంజలో వుంటుందని భావించిన వైసీపీలో సైతం మూడు సీట్లపై అయోమయం తప్పడం లేదు. ఇక కొత్తగా ఉత్సాహం పుంజుకున్న కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అసలు మొదలే కాలేదు. ఎన్నికల షెడ్యూలు నాలుగైదు రోజుల్లో వెలువడనున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీల తీరిలా వుండడంతో శ్రేణుల్లో తీవ్ర అయోమయం నెలకొంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీలో నాలుగు సీట్ల పెండింగ్

జిల్లాలో టీడీపీ బలంగా వుంది. ఎన్నికల్లో విజయం తమదేనని సమరోత్సాహం ప్రదర్శిస్తోంది. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు గానూ పొత్తులో తిరుపతిని జనసేనకు కేటాయించి తాను ఏడు స్థానాలను అట్టిపెట్టుకుంది. ఈ ఏడింటిలో నగరికి గాలి భానుప్రకాష్, గూడూరుకు పాశం సునీల్ కుమార్, సూళ్ళూరుపేటకు నెలవల విజయశ్రీలను ఖరారు చేసిన అధిష్ఠానం మిగిలిన చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పెండింగులో వుంచింది. చంద్రగిరిలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నానీ ఇంఛార్జిగా వున్నారు. పార్టీలో ఆయన్ను కాదని టికెట్ ఇతరులు అడిగే పరిస్థితి లేదు. గతేడాది యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చంద్రగిరి నుంచీ నానీని గెలిపించాలని శ్రేణులకు, ప్రజలకు పిలుపిచ్చారు కూడా.అయినా అధికారికంగా నానీని అభ్యర్థిగా ప్రకటించలేదు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంఛార్జి. ఆయనకు లేదా ఆయన తల్లి లేదా భార్య... ఇలా కుటుంబంలోనే ఎవరో ఒకరికి టికెట్ దక్కుతుందని ఇతరులకు దక్కే పరిస్థితి లేదని శ్రేణులతో పాటు ప్రజలు కూడా విశ్వసిస్తున్నారు. అయినా ఇంతవరకూ పార్టీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు. సత్యవేడులో డాక్టర్ హెలెన్ ఇంఛార్జి. ఆమె తల్లి మాజీ ఎమ్మెల్యే హేమలత ఇదివరకూ ఇంఛార్జిగా వున్నారు. ఆమెకంటే ముందు జేడీ రాజశేఖర్ ఇంఛార్జిగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య సైతం రేసులో వున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేరు కూడా పరిశీలనలో వుంది. వీరంతా కూడా బలమైన ఆశావహులే.వీరిలో ఎవరో ఒకరిని ఎంచుకుని టికెట్ ఖరారు చేయకుండా మీనమేషాలు లెక్కించడం శ్రేణుల్ని నీరసపరుస్తోంది. వెంకటగిరిలో ఇంఛార్జి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి టీడీపీలో చేరారు. ఆయన మొన్నటి దాకా వెంకటగిరి టికెట్ ఆశించినా ఇపుడు ఆత్మకూరు నుంచీ పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో రామకృష్ణకు పెద్దగా పోటీ లేకుండా పోయింది. అయినా పార్టీ టికెట్ ఖరారు చేయకుండా పెండింగ్ వుంచింది. ఇలా నాలుగు సెగ్మెంట్లలో అభ్యర్థుల ఎంపిక పెండింగ్ పడడం పార్టీ శ్రేణుల్ని నిరుత్సాహానికి గురి చేస్తోంది.

జనసేన ఏకైక సీటులోనూ అభ్యర్థి ఎంపిక పెండింగ్



జిల్లాలో జనసేనకు తిరుపతి స్థానాన్ని కేటాయించింది టీడీపీ. అయితే ఆ పార్టీ నుంచీ బరిలో నిలవగలిగే అభ్యర్థి లేరు. ఇద్దరు నేతలున్నా వారిలో ఒకరికి ఆర్థిక వనరులు వున్నా కూడా ఎన్నికల్లో ధారాళంగా ఖర్చు పెట్టరన్న పేరుంది. మరొకరికి పోరాడే తత్వమున్నా ఆర్థిక వనరులు తగినంత లేవు. దీంతో ఈ ఇద్దరి పేర్లూ వెనుకబడ్డాయి. ఇటీవల జనసేనలో చేరిన చిత్తూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ రేసులో వున్నారు. అలాగే టీడీపీ నేత, వ్యాపారవేత్త గంటా నరహరి టికెట్ కేటాయిస్తే జనసేనలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అలాగే తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా టికెట్ ఇచ్చేటట్టయితే జనసేనలో చేరడానికి సుముఖంగా వున్నట్టు సమాచారం. ఈ ముగ్గురిలో పరిమితికి మించి ఆర్థిక వనరులు తెగింపుతో ఖర్చు పెట్టగలిగే నేతకు అవకాశం దక్కుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కాకపోతే అభ్యర్థి ఎంపికపై అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాల సమాచారం. పొత్తులో కేటాయించిన ఏకైక సీటులో ఈ సందిగ్ధత పార్టీ శ్రేణులను నిరుత్సాహ పరుస్తోంది.

బీజేపీ ఏ స్థానం కోరుతుందో తెలియని వైనం



జిల్లాలో పొత్తు కారణంగా టీడీపీ ఇప్పటికే తిరుపతి స్థానాన్ని జనసేనకు వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. కాకపోతే జనసేన, బీజేపీలకు కలిపి స్థానాలు కేటాయించినందున జనసేనకు కేటాయించిన తిరుపతి స్థానం నుంచీ తన అభ్యర్థిని బరిలోకి దింపుతుందో లేక బీజేపీకి వదిలిపెడుతుందో అంతుబట్టడం లేదు.బీజేపీ తిరుపతి కాకుండా శ్రీకాళహస్తి సీటు కోరితే టీడీపీ, జనసేన పార్టీల నిర్ణయమెలా వుంటుందో తెలియడం లేదు. తిరుపతి, శ్రీకాళహస్తి సీట్లపై ఈ పరిస్థితి మూడు పార్టీల్లోనూ అయోమయ పరిస్థితిని సృష్టిస్తోంది. ఎంత త్వరగా ఆయా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకుంటే ఆయా పార్టీల శ్రేణుల్లో తలెత్తిన అయోమయానికి అంత త్వరగా తెర పడనుంది.

అధికార పార్టీలోనూ మూడు సీట్లపై అయోమయం

అధికారం, అన్ని అనుకూలతలూ కలిగివున్న వైసీపీ కూడా జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. చంద్రగిరి, తిరుపతి, గూడూరు, సత్యవేడులకు సమన్వయకర్తలను ప్రకటించగా వారంతా అభ్యర్థులుగా ప్రచారంలో తలమునకలయ్యారు. వెంకటగిరికి ఏడాది ముందుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కోఆర్డినేటర్‌గా ప్రకటించినందున ఆయన కూడా ప్రచారం చేపట్టారు. అయితే సూళ్ళూరుపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విషయంలో పార్టీ డోలాయమానంలో వుంది. కిలివేటికే టికెట్ అని ఇతర నాయకులు చెప్పడమే తప్ప అధిష్ఠానం నుంచీ ప్రకటన లేదు. అలాగే శ్రీకాళహస్తిలో సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి కాకుండా టికెట్ కోరే ఇతరులెవరూ లేకపోయినా అధిష్ఠానం నుంచీ ఆయనకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. అలాగే నగరి నుంచీ మంత్రి రోజాకు కూడా అధిష్ఠానం నుంచీ టికెట్‌పై సంకేతాలు అందడం లేదు. నియోజకవర్గంలో ఆమెకు టికెట్ వద్దని అధికార పార్టీ నేతలే అధిష్ఠానంపై పోరుతున్నారు. దీంతో అక్కడ బరిలో ఆమే వుంటుందా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది అంతుబట్టక పార్టీ శ్రేణులు తికమకపడుతున్నారు.



కాంగ్రెస్‌లో మొదలే కాని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

రెండు నెలలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో హడావిడి మొదలైన సంగతి తెలిసిందే. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ షర్మిల తొలుత పార్టీ కార్యకర్తల సమావేశం తిరుపతిలో నిర్వహించగా తర్వాత తిరుపతిలోనే భారీ బహిరంగసభ జరిపారు. ఈ రెండింటితో పార్టీ అభిమానుల్లో జోష్ నింపినప్పటికీ అభ్యర్థుల ఎంపిక గురించి అసలు పట్టించుకోకపోవడంతో శ్రేణులు డీలా పడుతున్నాయి.





టీటీడీ పాలకమండలి సమావేశం

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి నివేదిక

టీటీడీ పాలకమండలి నిర్ణయం

తిరుమల, మార్చి11(ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) ద్వారా కాకుండా టీటీడీ బోర్డు ఆమోదంతో 2014కు ముందు తీసుకున్న కాంట్రాక్ట్, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని నిర్ణయించినట్టు టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు.తిరుమలలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. టీటీడీలో ఐటీ సేవల కోసం టైర్ 3 డేటా సెంటర్, డిజాస్టర్ రికవరీ సెంటర్ ఉన్నాయని, ఐటీ స్టాండర్డ్ ప్రొటోకాల్ ప్రకారం ఏడేళ్లకు ఒకసారి టెక్ రీప్లేస్‌మెంట్ చేయాలన్నారు. ఇందులో భాగంగా ఐదేళ్ల పాటు డేటా సెంటర్ల నిర్వహణ కోసం రూ.12 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో 15 చారిత్రాత్మక, పురాతన ఆలయాలు, టీటీడీ నిర్మించిన 13 ఆలయాలు, ఆధీనంలోకి తీసుకున్న 22 ఆలయాల్లో అభివృద్ధి పనులను శ్రీవాణిట్రస్టు నిధుల ద్వారా చేపట్టేందుకు ఆమోదం తెలిపామన్నారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని భాష్యకార్ల సన్నిధిలోని మకర తోరణానికి, పార్థసారథి స్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరువాభరణాలకు బంగారు పూత పూసేందుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. స్విమ్స్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో 479 నర్సు పోస్టులు క్రియేట్ సేందుకు తీర్మానం చేశామన్నారు.శ్రీవారి ఆశీస్సులతో మంగళసూత్రాలను భక్తులకు విక్రయించేందుకు తయారీ కోసం పలు సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తిరుమలలోని టీటీడీ ఉద్యోగుల పాత సీ టైప్, డీ టైప్, కొత్త సీ టైప్, డీ టైప్ క్వార్టర్స్‌లో మిగిలి ఉన్న 184 క్వార్టర్స్ అభివృద్ధి పనులకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.టీటీడీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించడం కోసం అవసరమైన భవనాల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. రూ.1.88 కోట్లతో తిరుమలలో భక్తుల సౌకర్యార్థం పీఏసీ1లో 10 లిఫ్టుల ఏర్పాటుకు టెండరు ఆమోదించామన్నారు.రూ.1.50 కోట్లతో బాలాజీనగర్ తూర్పువైపున, పద్మావతి విశ్రాంతి భవనం ఔటర్ కార్డన్ ప్రాంతంలో మిగిలిపోయిన ఫెన్సింగ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఘాట్ రోడ్డులో మరణించిన తిరుమల ఆలయ పరిచారకుడు యతిరాజన్ నరసింహన్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు.ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక శ్రీవారి దర్శనానికి రాజకీయ ప్రముఖుల సిఫార్సు లేఖలను స్వీకరించకూడదని తీర్మానం చేసినట్టు సమాచారం. ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పించాలనుకున్నట్టు తెలిసింది.

రంజాన్ వేళలు
మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.31
బుధవారం : సహర్ : ఉదయం -5.04





తిరుపతి కలెక్టరేట్ వద్ద పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆందోళన

సర్పంచుల పోరుబాట

పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11: ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచులు పోరుబాట పట్టారు. తమ 16డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.జగన్ ఓడితేనే మన మనుగడ అనే నినాదంతో అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి కృషి చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన విధులు, నిధులు దోచేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించండని కోరుతూ సర్పంచులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు.పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్ మాట్లాడుతూ సర్పంచులకు తెలియకుండా వారి ఖాతాల్లో నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని... దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను ఓడించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించే సీఎంను ఎన్నుకుందామన్నారు. సిద్ధం అనే నినాదంతో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్ గడచిన మూడేళ్లుగా సర్పంచుల ఆందోళన చేస్తుంటే చర్చలకు మాత్రం సిద్ధం కాలేదని విమర్శించారు.సర్పంచుల సంఘం 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రతాపరెడ్డి, ప్రకాష్‌నాయుడు, చింతా కిరణ్‌యాదవ్, జనార్దన గౌడ్, రాము, మురళి, కొత్తపు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి


నాగూర్ ఇమ్రాన్ (ఫైల్‌ఫొటో)

పాకాల, మార్చి 11: ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం పాకాల పెద్దచెరువులో జరిగింది. హసన్‌పురానికి చెందిన నాగూర్ ఇమ్రాన్ (23) ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి కాలుజారి చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో 20 అడుగుల లోతున్న చెరువు నీళ్లలో మునిగి మృతిచెందాడు. చెరువు సమీపంలో ఇతడి మోటారు సైకిల్ ఉండడం గమనించిన స్థానికులు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వెళ్లి నీళ్లలో వెతకగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ పోస్టు తనిఖీల్లో తుపాకీ లభ్యం

చంద్రగిరి, మార్చి 11: చంద్రగిరి మండలం పాకాలవారిపల్లె పోలీస్ చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి నాటు తుపాకీ లభ్యమైంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి లోని పాకాలవారిపల్లె వద్ద పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తుండగా పాకాలవారిపల్లె చెక్ పోస్టు ఉండటంతో పోలీసుల తనిఖీలు చూసి గుర్తుతెలియని వ్యక్తులు ఆ పరిసరాల్లో నాటు తుపాకీని పడేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో 60 మామిడి చెట్ల దగ్ధం



పాకాల, మార్చి11: ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు రైతులకు చెందిన మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రైల్వేట్రాక్ సమీపంలో చెలరేగిన మంటలు సుబ్రమణ్యస్వామి గుడి వరకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో వి.శ్రీనివాసులునాయుడుకు చెందిన 30 మామిడి చెట్లు, 10 టెంకాయ చెట్లు, శిరీషకు చెందిన 15 మామిడి చెట్లు, బుజ్జినాయుడుకు చెందిన 15 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. పాకాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఉప్పరపల్లెలో టీడీపీ ప్రచారం

పాకాల, మార్చి 11: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీలో టీడీపీ, జనసేన నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఊట్లవారిపల్లె, నన్నూరివారిపల్లె, రామిరెడ్డిగారిఇండ్లు, మేడసానిఇండ్లు, అబ్బానాయుడు ఇండ్లలో టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి తదితరులు పర్యటించారు.

నాగాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



చంద్రగిరి, మార్చి 11: చంద్రగిరి సమీపంలో వెలసిన నాగాలమ్మ ఆలయ ఆవరణలో గణపతి, సుబ్రమణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి, దాతలు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్లో మెనూ పాటించరా: ఎస్ఎఫ్ఐ

చంద్రగిరి, మార్చి 11: చంద్రగిరిలోని బీసీ బాలికల హాస్టల్‌లో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం పెట్టడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, చంద్రగిరి ఇన్‌చార్జ్ తేజ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులకు సక్రమంగా స్నాక్స్ ఇవ్వలేదని, మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని తెలిపారు. ఆర్వో సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

టీడీపీ బీసీ, రజక కమిటీల ఏర్పాటు



తిరుపతి, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నగర బీసీ, రజక కమిటీలను సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఏర్పాటు చేశారు. బీసీ నగర అధ్యక్షుడిగా మేడికుర్తి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా వై.కుమార్‌ను నియమించారు. కుమార్ యాదవ్, గజేంద్ర, జగదీష్ రెడ్డి, లక్ష్మి, తులసి, అశోక్‌ను కమిటీ ప్రతినిధులుగా ఎంపిక చేశారు. అదేవిధంగా రజక సాధికార సమితి కన్వీనర్‌గా వెంకటమునిని, వినోద్, సురేంద్ర, గణేష్, గోపాల్, భాగ్యలక్ష్మి, గీత, విజయమ్మ తదితరులను సభ్యులుగా నియమించారు. వీరికి నియామక పత్రాలను సుగుణమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, నాయకులు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, హేమంత్ రాయల్, కుమారమ్మ, రేవతి. నాగరాజు, సుబ్బయ్య, అశోక్, జగన్నాథం, పెంచలయ్య, ప్రకాష్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యే సీటు బీసీలకు కేటాయించాలి


మీడియాతో రుద్ర గోపి

తిరుపతి సిటీ, మార్చి 11 : చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును బీసీలకు కేటాయించాలని బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రుద్ర గోపి కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,37,772 బీసీ ఓట్లు ఉన్నాయని, కానీ ఏ ఒక్క ఉన్నత పదవిలోనూ బీసీలు లేకపోవడం బాధాకరమని అన్నారు. టీడీపీకి మొదటి నుంచి బీసీలే అండగా ఉంటూ ఓట్లు వేస్తున్నారని, అలాంటి బీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని బీసీలను పూర్తిగా పక్కన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బీసీలకు అండగా ఉంటున్న బడి సుధాయదవ్ లాంటి వ్యక్తికి అవకాశం ఇస్తే తప్పక గెలిపించుకుంటామన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్‌గా సాల్మన్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

తిరుపతి సిటీ, మార్చి 11 : కాంగ్రెస్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్‌గా కనపర్తి సాల్మన్‌రాజును నియమించినట్లు కాంగ్రెస్ ఎస్టీ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ జిల్లాలో క్రిస్టియన్లను బలోపేతం చేసే బాధ్యతను సాల్మన్‌రాజుకు అప్పగిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించిందన్నారు.బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని సాల్మన్‌రాజు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

రామచంద్రాపురం, మార్చి 11: మండలంలోని సొరకాయలపాళెం, కేకేవీపురం సచివాలయాల పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులను ఎంపీపీ బ్రహ్మానందారెడ్డి, చెవిరెడ్డి ధ్యానేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీరాణి, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బకాయిలు చెల్లించండి


ర్యాలీగా వెళుతున్న అగ్రిగోల్డ్ బాధితులు

తిరుపతి, సెంట్రల్ 11: అగ్రిగోల్డ్ బాధితుల బకాయిలను వెంటనే చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు టి.జనార్ధన్, బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 19.50 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని, కేవలం 3,400 మందికి చెల్లించి చేతులు దులుపుకున్నారని తెలిపారు. మిగిలిన 13 లక్షల మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, న్యాయం చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో నాయకులు శివరామకృష్ణ, గోపి, జయచంద్ర, ఫణికుమార్, ప్రభాకర్, బాధితులు పాల్గొన్నారు. సీపీఐ నాయకులు పి.మురళి, విశ్వనాథ్, సి.పెంచలయ్య మద్దతు తెలిపారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి, మార్చి 11: చంద్రగిరి ద్వారకానగర్ లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 14వ తేది నుంచి 30 రోజులపాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. వివరాలకు 7989680587, 9494951289, 630171672 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చిన్నగొట్టిగల్లులో బీఎంసీయూ ప్రారంభం

భాకరాపేట, మార్చి11: చిన్నగొట్టిగల్లులో బీఎంసీయూను సోమవారం కలెక్టర్ లక్ష్మీశా ప్రారంభించారు. నల్లపురెడ్డిగారిపల్లె, చెరువుముందరపల్లె గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను పరిశీలించారు.ఎంపీపీ యుగంధర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి లక్ష్మి, జిల్లా పశుసంవర్థక అధికారి రవికుమార్, ఎంపీడీవో దేవేంద్రబాబు, జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


ద్రోణవల్లి హారిక - అలేఖ్య

తిరుమల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్య, తమిళ నటుడు విజయ్ ఫ్యామిలీ లిరిక్ రైటర్ శోభ, దర్శకుడు చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.



టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి జన్మదిన వేడుకలు

చంద్రగిరి, మార్చి 11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి.చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముండ్లూరి బాలకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

భాకరాపేట, మార్చి 11: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని పులివర్తి వినీల్ అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన చిన్నగొట్టిగల్లు పంచాయతీలోని రాజువారిపల్లె, ఎండపల్లెవారిపల్లె, కొత్త కాలనీ, రాయపాటివారిపల్లె, లంకిపల్లెవారిపల్లె, చెరువుముందరపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆర్వో రమణారెడ్డి, మునస్వామి నాయుడు, నాగరాజా, బాలసుబ్రహ్మణ్యం, విజయశేఖర్ గౌడ్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, హైదర్‌వల్లీ, గురుమూర్తి, మల్లికార్జున రెడ్డి, కుమారస్వామి రెడ్డి, వెంకటరత్నం, విజయ్ కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నరసింహం

తిరుపతి సిటీ, మార్చి 11 : వైద్యులు రోగులకు వైద్యం అందించడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని డీఎంఈ డాక్టర్ నరసింహం అన్నారు. రుయాస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు రోగితో చక్కగా మాట్లాడితే వారి వ్యాధి సగం తగ్గిపోతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అదే విషయాన్ని వైద్య విద్యార్థులకూ నేర్పాలన్నారు. అనంతరం ప్రపంచ వినికిడి దినం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు పాల్గొన్నారు.

న్యూ మంగళం పంచాయతీలో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న సర్పంచ్ వీరమ్మ

మంగళం, మార్చి 11: న్యూ మంగళం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ వీరమ్మ తెలిపారు. సోమవారం గ్రామ సచివాలయంలో వార్డు మెంబర్లతో ఆమె సమావేశమయ్యారు. మిట్టగాంధీపురం, చెన్నాయగుంటలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా రెండుబోర్లు, మూడు చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి విజయభాస్కర్, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు మెంబర్లు ముని, వాసు, వేమూరి తనుజ, మంగమ్మ, బాలసుబ్రహ్మణ్యం, మునిలక్ష్మి, కృష్ణయ్య పాల్గొన్నారు.

రేపు పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11 : పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభించి బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ ముఖాముఖి నిర్వహించనున్నారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారమంత్రిత్వ శాఖ ప్రతినిధి రాజేష్‌కుమార్ మక్కర్, సంబంధిత అధికారులతో కలిసి పీఎం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, కరంచారి లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

శేషాచల అడవికి నిప్పు


మండుతున్న అడవి

మంగళం, మార్చి 11 : మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్ వద్ద శేషాచల అడవులకు సోమవారం సాయంత్రం నిప్పంటుకుంది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. ఇది ఆకతాయిల పనై ఉంటుందని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు. ఎండుగడ్డి ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించాయన్నారు. అడవులకు నిప్పంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశాలకు విధిగా హాజరుకావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం, మార్చి 11: ఇకపై మండల సమావేశానికి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి కోరారు. సోమవరం మండల సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఢిల్లీరాణి మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అనుపల్లి పంచాయతీలో ఇంటి పట్టాలు ఇచ్చిన రెండేళ్లు అయినా స్థలాలు చూపలేదన్నారు. తహసీల్దారు ఉషారాణి జోక్యం చేసుకుని స్థల వివాదాలు కోర్టులో ఉన్నందున తక్షణం పరిష్కరించలేకపోతున్నామన్నారు. ఎంపీడీవో ప్రత్యూష మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు లావణ్య, చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్ర బాబు, రాజేష్, జ్ఞానమ్మ, మంజుల, కృష్ణవేణి, సర్పంచులు కే.వేణుగోపాల్‌నాయుడు, మురగయ్య, బారతి, ఏవో స్రవంతి, ఎంఈవో మార్కండేయనాయుడు, ఏపీఎం రాధమ్మ, ఏపీవో హంసవేణి, ఏఈ పవన్, ఈవోపీఆర్డీ దేవిక తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు

రామచంద్రాపురం, మార్చి 11: మండలంలోని రావిళ్లవారిపల్లి ఏపెడ బ్యాకు చెందిన పలు కుటుంబాల వారు వైసీపీ మండల ఇన్‌చార్జి సుధాకరరెడ్డి, ధ్యానేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీరాణి, ఎంపీటీసీ రాజేష్ పాల్గొన్నారు.



సుగుణమ్మను కలిసిన మాజీ ఐఆర్ఎస్ అధికారి

తిరుపతి, మార్చి11(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, మాజీ ఐఆర్ఎస్ అధికారి డి.ప్రసాదరావు సోమవారం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఆయన్ను శాలువా కప్పి అభినందించారు. ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

62 ఏళ్ల వరకు కొనసాగించండి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు టైంస్కేల్ ఉద్యోగుల విన్నపం


హేమచంద్రరెడ్డికి విన్నవిస్తున్న సుబ్రమణ్యంరెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: తమకు పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రరెడ్డిని యూనివర్సిటీ టైం స్కేల్ ఉద్యోగులు కోరారు. తిరుపతి పర్యటనకు వచ్చిన హేమచంద్రరెడ్డిని టైంస్కేల్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి నేతృత్వంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎర్రసాని సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచిందన్నారు. ఈ ఉత్తర్వులు కేవలం పర్మినెంట్ ఉద్యోగులకు మాత్రమే అనడంతో తమకు అన్యాయం జరుగుతోందన్నారు. బ్లాక్ గ్రాంట్ నుంచే వేతనాలు పొందుతున్న తమకూ ఈ నిర్ణయాన్ని వర్తింపజేయాలని కోరారు. రిటైర్డు సమయంలో ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన హేమచంద్రారెడ్డి తక్షణం టైంస్కేల్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, ప్రసాద్, రెడ్డిమణి, నాగరాజు, మధు, తిరుపాల్‌రెడ్డి, మునేంద్ర, విజయ్, చంద్రనాయుడు, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

మాదిగలకు ఎన్ని సీట్లు ఇస్తారో తేల్చాలి

తిరుపతి సిటీ, మార్చి 11 : ఈ ఎన్నికల్లో మాదిగలకు ఎన్ని సీట్లు కేటాయిస్తారో తేల్చాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ జాతీయ కన్వీనర్ గుడిమల్లం గిరిధర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో మాదిగలకు ఎలాంటి సంక్షేమమూ అందలేదన్నారు. కేవలం ఓటు వేసేందుకు తప్పా అధికారంలోకి వచ్చే అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే మాదిగలకు ప్రాధాన్యత ఇస్తుందో వారికే తమ మద్దతు తెలియజేస్తామని పేర్కొన్నారు. మహిళా కన్వీనర్ ప్రశాంతి, నేతలు సుబ్బయ్య, గంగాధరం, మురళి తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఎంపీడీవో కార్యాలయానికి తాళం


కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11: వేతనాలు చెల్లించాలని మండలంలోని పారిశుధ్య కార్మికులు సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి తాళాలు వేశారు. గేటు బయట అడ్డుగా కూర్చుని సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 24 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 24 నెలలకు జీతాలు ఇవ్వాల్సి ఉండగా మండల స్థాయి అధికారులు ఒక నెలకు జీతాలు ఇస్తామని చెప్పడం శోచనీయమన్నారు. కనీసం పది నెలలు జీతాలు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవో షాలెట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకులు మునిచంద్ర, అన్నాదొరై, చంద్రబాబు, గంగయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి

రామచంద్రాపురం, మార్చి 11: మండలంలోని కేకేవీపురం గ్రామానికి చెందిన పంచవటి జ్యోతి జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు.

సంస్కృత వర్సిటీలో ఆగమశాస్త్ర సదస్సు ప్రారంభం


సదస్సు బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ

తిరుపతి (రూరల్), మార్చి11 : జాతీయ సంస్కృత వర్సిటీలో ఆగమశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వచ్చిన కర్ణాటక రాష్ట్రంలోని మేలకోట సెల్వనారాయణ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు ఎస్.నరసరాజబట్టర్‌తో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కలసి ప్రారంభించి మాట్లాడారు. పాంచరాత్రాగమంలో పద్మసంహిత గొప్పతనాన్ని వివరించారు. ఆగమశాస్త్రాన్ని విశదీకరించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్ఆర్‌బీఎస్ఆర్ మహావిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామాచార్యులు మాట్లాడుతూ ఆగమశాస్త్ర జ్ఞానం ద్వారా ఆధ్యాత్మికతత్వాలను చక్కగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, దర్శన విభాగ డీన్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు, డాక్టర్ పీటీజీ రంగరామానుజాచార్యులు పాల్గొన్నారు.

అవధాన ప్రక్రియతో జ్ఞాపకశక్తి పెంపు



తిరుపతి(రూరల్), మార్చి 11 : అవధాన ప్రక్రియ చాలా క్లిష్టమైందని, విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచేందుకు ఇది దోహదపడుతుందని సహస్రావధాని మేడసాని మోహన్ పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో సోమవారం అవధానసంపు-2 ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ అవధాన వైశిష్ట్యాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి సంఘంలో భాగస్వాములై జ్ఞానాన్ని, జ్ఞాపకశక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు. హర్యాణ రుషి హుడ్‌వర్సిటీ సెంటర్‌ఫర్ హ్యూమన్‌సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంపదానందమిశ్ర, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్టూడెంట్స్ వెల్ఫేర్‌డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, రిజిస్ట్రార్ ఆర్జే రమాశ్రీ, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా రహిత జిల్లా లక్ష్యం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11 : గ్లకోమా రహిత జిల్లా లక్ష్యంగా వైద్యాధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో 10 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ గ్లకోమ వారోత్సవాలలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి పోస్టరును ఆవిష్కరించారు. 16వ తేదీ వరకు ఈ వ్యాధి లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. రుయా ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహిస్తారన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, డీపీఎం కంటి వెలుగు మధుబాబు, వైద్యా ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏఏ అమలును స్వాగతిస్తున్నాం

తిరుపతి(విద్య),మార్చి11: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ చట్టం అమలును స్వాగతిస్తున్నామని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. 2019లో సీఏఏ బిల్లును తీసుకొచ్చి చట్టం చేసినా ఆచరణలో కొంతజ్యాపం జరిగిందని, తాజాగా అమలుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రధానంగా ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చిన హిందూ, బౌద్ధ, సిక్కు, జైన, పారశీక, క్రైస్తవ మతాల వారికి భారత పౌరసత్వాన్ని ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు.

ఈయూ అధ్యక్షుడికి స్వాగతం



తిరుపతి (ఆర్టీసీ), మార్చి 11: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరానికి సోమవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌లో జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన్ను సెంట్రల్ బస్సుస్టేషన్‌కు ఆహ్వానించి, పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆవుల ప్రభాకర్‌యాదవ్, కార్యదర్శి ఈ.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి తండాయం సత్యనారాయణ, మధు, మస్తాన్, వెంకటేశ్వరబాబు, సతీష్‌నాయుడు, ఏబీఎస్ మణ్యం, కె.రఘు పాల్గొన్నారు.

ప్రభాకర్‌యాదవ్‌కు ఎస్పీ అభినందన


ప్రభాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ


తిరుపతి(ఆర్టీసీ), మార్చి 11: తిరుమలలో ఆదివారం చిన్నారి అదృశ్యం ఘటనకు సంబంధించి నిందితురాలి ఆచూకీని సకాలంలో పోలీసులకు తెలియజేసిన ఆర్టీసీ సెంట్రల్ బస్సుస్టేషన్ కంట్రోలర్, ఎంప్లాయీస్ యూనియన్ నేత ఆవుల ప్రభాకర్‌యాదవ్‌ను ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ అభినందించారు. సోమవారం ఉదయం ఆయన్ను ఎస్పీ కార్యాలయానికి పిలిపించి ఘనంగా సన్మానించారు. తమ పనిని సులభతరం చేశారంటూ కొనియాడారు.

జగనన్న ఇంటిపట్టా రిజిస్ట్రేషన్ కాలేదు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

తిరుపతి(రూరల్), మార్చి11: చంద్రగిరి మండలంలోని ఐతేపల్లి జగనన్నకాలనీలో తమకు ఇంటిపట్టా ఇచ్చారని, అయితే ఇప్పటికీ రిజిస్ట్రేషన్ కాలేదని సి.మల్లవరం పంచాయతీ గాంధీపురానికి చెందిన ఓ మహిళ వాపోయింది. తహసీల్దార్ కార్యాలయలో సోమవారం జరిగిన స్పందనలో పలువురు తమ సమస్యలు తెలియజేశారు.దీనిపై స్పందించిన తహస్దీర్ మెహబూబ్ చాంద్ సంబంధిత వీఆర్వోని వివరణ కోరగా సెక్రటరీ లాగిన్‌లోకి రాకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ కాలేదని వివరించారు. అలాగే స్టాఫ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న తమ రిజిస్ట్రేషన్ భూమిలో ఇంటిని నిర్మించుకునేందుకు అనుమతించాలని ఓ మహిళా బాధితురాలు కోరగా అది ప్రభుత్వ భూమి అని అందులో ఇంటినిర్మాణానికి అనుమతి లేదని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, సర్వేయర్ కరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు



రామచంద్రాపురం, మార్చి 11: గంగిరెడ్డిపల్లె, కమ్మకండ్రిగ, ఆర్‌సీపురం, మెట్టూరు, రామాపురం గ్రామాల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. ఈ కవాతులో డీఎస్పీ, ఎస్ఐ చిరంజీవితో పాటు 70మంది కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి



కేంద్ర బలగాలకు కిట్‌లను అందజేస్తున్న ఎస్పీ

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : సాధారణ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని బీఎస్‌ఎఫ్ దళాలకు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, భక్తులకు భద్రత కల్పిస్తూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలల్సిన బాధ్యత కేంద్ర సాయుధ బలగాలపై ఉందన్నారు. అనంతరం స్పెషల్ పార్టీ పోలీసులకు స్పోర్ట్స్ షూ, పిటి డ్రస్, లైట్ లగేజ్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీలు రవీంద్రారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



నిందితుడు, నగలతో పోలీసులు

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : తిరుపతి పోలీసులు సోమవారం అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతని నుంచి రూ.10 లక్షల విలువైన 178 గ్రాముల బంగారు నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరు సిటి యావనహాళికి చెందిన వినోద్ చిన్నప్పటి నుంచి మిత్రులు రాజు, నాగరాజు, లక్ష్మణ్, ఆనందకుమార్‌తో కలసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కర్ణాటక, తమిళనాడులోని శేషాద్రిపురం, జోలార్‌పురం, ధర్మపురి, ఎలక్ట్రానిక్‌సిటీ, జైనగర్, హనుమంత్ నగర్‌లలో చోరీలకు పాల్పడాడు. అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలకు పాల్పడుతుండగా ధర్మపురి పోలీసులు గూండా యాక్ట్ కింద 9 నెలలు జైల్లో ఉంచారు. మళ్లీ బయటకు వచ్చి తిరుపతి మారుతీనగర్, సుభాష్‌నగర్, సుందరయ్య నగర్, పీకే లేఅవుట్, రైల్వే కాలనీల్లో చోరీ చేశాడు. నిఘా ఉంచిన క్రైం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్లుగా అవకాశం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 11 : తిరుపతి, అలిపిరి, మంగళం డిపోలలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు అర్హులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల డ్రైవర్లు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 18నెలలు పూర్తయిన వారు ఒరిజినల్స్‌తో డిపో మేనేజర్లు టి.బాలాజీ(తిరుపతి-9959225670), ఎస్.హరిబాబు(అలిపిరి-9959225671), కె.భాస్కర్(మంగళం-7893723453)లను సంప్రదించాలని పేర్కొన్నారు. రోజుకు వేతనం రూ.800 చెల్లిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం



స్విమ్మింగ్ చేస్తున్న ఈతగాళ్లు

తిరుపతి(క్రీడలు), మార్చి 11: శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఈతకొలనును సోమవారం ప్రారంభించారు. ఏటా చేసే మరమ్మతులు పూర్తి చేసి, స్విమ్మింగ్ పూల్‌ను నగరవాసులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉదయం లాంఛనంగా ప్రారంభించి, ప్రజలను అనుమతించారు. ఉదయం, సాయంత్రం మూడు స్లాట్స్ చొప్పున ఏడుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు, 12మంది పిల్లలు తొలిరోజు పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, కోచ్ చక్రవర్తి పాల్గొన్నారు.

యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శిగా శంకర్‌యాదవ్



నియామక పత్రం అందుకుంటున్న శంకర్‌యాదవ్

తిరుపతి అర్బన్, మార్చి 11 : యాదవ మహాసభ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా చిట్టిబోయిన శంకర్‌యాదవ్ నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. యాదవుల మధ్య ఐక్యత పెంచి, యాదవుల మహాసభ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. యాదవుల ఎదుగుదలకు తనవంతు కృషి చేస్తానని శంకర్‌యాదవ్ పేర్కొన్నారు.

ముగిసిన ఆర్గానిక్ మేళా



తిరుపతి (కల్చరల్), మార్చి 11: ఎయిర్ బైపాస్ మార్గంలోని యూత్ హాస్టల్ వేదికగా మూడు రోజులు జరిగిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన సోమవారం ముగిసింది. కనెక్ట్-2 ఫార్మర్ సంస్థ నిర్వహించిన ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాల సేంద్రియ రైతులు, చేనేత కుటుంబాలు పాల్గొన్నాయి. పలు అంశాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు సేంద్రియ సాగులో మెలకువలు నేర్పించారు. కూరగాయలు, ఆకు కూరలు, చెక్కగానుగ నూనె, సేంద్రియ విత్తనాలు, ఎరువులు విక్రయించారు. పెన్‌కళంకారిలో పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకురాలు శిల్ప తెలిపారు. తొలిరోజు కరోనా అనంతరం యువతరంలో పెరుగుతున్న ఆకస్మిక మరణాలపై ప్రముఖ పాత్రికేయురాలు, డాక్యుమెంటరీ సినీ నిర్మాత సరస్వతి కవుల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

రోజాకు సీటిస్తే ఓడిస్తాం

● వైసీపీ నేతల హెచ్చరిక



రోజా వద్దంటూ కరపత్రాలు చూపుతున్న వైసీపీ నేతలు

తిరుపతి సిటీ, మార్చి 11 : నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి, అన్నదమ్ములను అడ్డం పెట్టుకుని మంత్రి రోజా అక్రమ సంపాదనకు తెర లేపారని, పార్టీ నేతలకు అండగా ఉండకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ ఎన్నికల్లో ఆమెకు సీటు ఇస్తే ఓడించి తీరుతామని వైసీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మురళి స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గంలోని వైసీపీ నేతలతో కలిసి ఆయన సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎంతో శ్రమించి ఆమెను ఎమ్మెల్యేగా గెలిపించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలనే ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. చిన్న పని కోసం అధికారుల దగ్గకు వెళ్లినా 'మంత్రి గారిని లేదా వాళ్ల అన్నదమ్ములను కలవండి.. వారు చేస్తేనే చేస్తాం' అని చెబుతున్నారని వాపోయారు. రోజా అన్నదమ్ములను కలిస్తే డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కాయంగుట్ట పంచాయతీలో జగనన్న కాలనీ పేరుతో గ్రావెల్ తరలించి రూ.కోట్లు సంపాదించిన విషయం నియోజకవర్గంలో ఎవర్ని అడిగినా చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జయచంద్రారెడ్డి, మునీంద్ర పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.88 కోట్లు

తిరుమల, మార్చి11(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.88 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,213 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,477 మంది తలనీలాలు సమర్పించారు.

పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ పదవీ కాలం పొడిగింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ వీసీ భారతి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హోం సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రజని ఈ ఏడాది జనవరి 5వ తేదీకి రిజిస్ట్రార్‌గా ఏడాది కాలాన్ని పూర్తి చేసుకున్నారు. వర్సిటీకి యూజీసీ నాక్ ఏ ప్లస్ గుర్తింపు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన, పరీక్షల నిర్వహణ, సకాలంలో ఫలితాల వెల్లడితోపాటు యూనివర్సిటీ పాలనలో తన సమర్థతను నిరూపించుకున్నందు వల్లే రిజిస్ట్రార్ పదవీ కాలాన్ని పొడిగించినట్లు వీసీ స్పష్టం చేశారు.

మఠం భూముల్లో నిర్మాణాలతో నష్టపోతారు

● ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

తిరుపతి అర్బన్, మార్చి 11: హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఆర్థికంగా నష్టపోతారని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు ఓ ప్రకటనలో హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని హథీరాంజీ మఠం భూముల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో గతవారం తొలగించామన్నారు. అయినా నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నారు. అక్కడ భూ మాఫియా తయారై అమాయకులను మోసం చేసి, సొమ్ము చేసుకుంటోందని అన్నారు. ఎప్పటికైనా ఆ భూములు మఠం వశమవుతాయని, ఎంతమంది చేతులు మారినా ఎలాంటి హక్కూ ఉండదని స్పష్టం చేశారు. కావున ప్రజలు భూ దళారులను, మాఫియాను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. మఠం భూములను విక్రయిస్తున్న వ్యక్తుల వివరాలు, సమాచారం అందించాలని కోరారు.

నేడు రామకృష్ణపరమహంస జయంతి

తిరుపతి (కల్చరల్), మార్చి 11 : స్వామి వివేకానంద ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస 189వ జయంతి వేడుకలను మంగళవారం వినాయకనగర్‌లోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజ, సంకీర్తనం ఉంటుందని, హోమం, పుష్పాంజలి, ఆశ్రమ కార్యదర్శి సుకృతానంద ప్రసంగం ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం ఆరాత్రికం, భజనలు ఉంటాయని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 565మంది గైర్హాజరు

తిరుపతి(విద్య),మార్చి11: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు సోమవారం జిల్లాలో 565మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో 25,476మందికిగాను 24,911 మంది పరీక్ష రాశారని తెలిపారు. జనరల్‌లో 24,343మందికిగాను 23,860, ఒకేషనల్‌లో 1,133మందికిగాను 1051మంది పరీక్ష రాశారని వివరించారు.

తేనెటీగల పెంపకంపై సదస్సు

తిరుపతి(రూరల్), మార్చి 11 : తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 14, 15 తేదీల్లో తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. జాతీయ తేనెటీగల పెంపకం, తేనెమిషన్ పథకంలో భాగంగా ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల జాతీయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈసదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. తేనెటీగల పెంపకంలో మెళకువలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి అంశాలపై అవగాహనతోపాటు నిష్ణాతులైన రైతులు తమ అభిప్రాయాలను పంచుకుంటారని వివరించారు. ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులైన విద్యార్థులు, మహిళలు, అంకుర సంస్థలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



రుక్సానా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: పద్మావతి యూనివర్సిటీ హోం సైన్స్ పరిశోధకులు ఎస్‌కె రుక్సానా డాక్టరేట్ పొందారు. ఓబేజ్ డయాబెటిక్స్ - డైటరీ అండ్ అదర్ మేనేజ్‌మెంట్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ జ్యోతి పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు.

టూరిజం అండ్ ట్రావెల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ, మార్చి 11 : కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ కోర్సులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ అడ్మిన్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నెల్లూరు కేంద్రంగా ఈ సంస్థ 40 ఏళ్లుగా నడుస్తోందన్నారు. ఏదైనా డీగ్రీ చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని, రిజర్వేషన్ ఉన్న వారికి ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోర్సు చేసిన వారికి నూరు శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పూర్తి వివరాలకు సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..

● కలెక్టరేట్ స్పందనలో అర్జీదారుల గోడు
● అధికారుల దృష్టికి 119 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11 : చాలాసార్లు అర్జీలు ఇచ్చాం.. పరిష్కారం కావడం లేదు. వాటిపై దృష్టి పెట్టండి మహాప్రభో.. అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీలు అందజేశారు. 119 వినతులు వచ్చాయి. అందులో భూ సమస్యలపై అత్యధికంగా 85 ఉన్నాయి. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు.

కాలువను కబ్జా చేశారు



వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని కాలువను గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించాడు. తద్వారా మురుగునీరు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అధికారులకు నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై విచారణ జరిపి కాలువను పునరుద్ధరించండి.

- రామచంద్రారెడ్డి, పెద్దకన్నలి, తొట్టంబేడు

ప్రభుత్వ భూమిని కాపాడండి

తనపల్లి పంచాయతీ నల్లమానుకాలువ దళితవాడలో 87సెంట్ల చెరువుకట్ట పొరంబోకు భూమిలో కొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. రేకుల షెడ్డు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. ఎంతో విలువైన భూమిని కాపాడండి.

- నల్లమానుకాలువ వాసులు, తిరుపతి రూరల్ మండలం

మెస్ బిల్లులు చెల్లించండి



సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ బిల్లులు చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు రవి, అక్బర్ కోరారు. నాలుగేళ్లుగా బిల్లులు సరిగా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని అధికారులకు విన్నవించారు.

జేసీకి వినతిపత్రం ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

స్పందన అర్జీలకు మొదటి ప్రాధాన్యత

● ఎస్పీ కృష్ణకాంత్ పటేల్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : స్పందన ద్వారా వచ్చే ఆర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఒక్కరి బాధలను అర్థం చేసుకుని సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని పోలీసు అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థికపరమైన నేరాలు, ఆస్తి తగాదాలపై 67 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు ఎస్పీ వెంకటరావు, ఎస్పీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాల పరిశీలన

● ఎస్వీ జూనియర్ కాలేజీ, పద్మావతి వర్సిటీల్లో భవనాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ పటేల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: పోలింగ్ అయిన తర్వాత ఈవీఎంలను భద్రపరచడానికి అవసరమైన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన భవనాలను కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పరిశీలించారు. ఎస్వీ జూనియర్ కాలేజీ, పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ భవనాలను సోమవారం వారు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్వీ జూనియర్ కాలేజీలో సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, అసెంబ్లీలు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రంగా వినియోగించుకునే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పద్మావతి యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ భాస్కరరెడ్డి, ఆర్‌ఎస్ డీటీ రామచంద్ర పాల్గొన్నారు.

వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 11 : జిల్లాలో వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలని తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ సీ రమణ సూచించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సోమవారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం, జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేయాలన్నారు. మరో అతిథి, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీ ముకుందరావు మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి అవసరమైన పద్ధతులను రైతులకు చేరువగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో నిర్వహించిన వివిధ పరిశోధనలు, ప్రదర్శనలు, పథకాలు, విస్తరణ కార్యక్రమాల ఫలితాలను విశ్లేషించారు. 2024-25లో నిర్వహించాల్సిన విస్తరణ కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి, వ్యవసాయ పరిశోధనా స్థానాల అధిపతులు డాక్టర్ ఓ వెంకటేశ్వర్లు, యు వినీత, డాక్టర్ కరీముల్లా, తిరుపతి, గుంటూరు, నెల్లూరుకు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆదర్శ రైతులు, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరు, రాజమండ్రికి ప్రత్యేక బృందాలు

బాలుడి కిడ్నాప్ కేసులో ముద్దాయికి రిమాండ్

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : తిరుమలలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసులో నిందితురాలు ఇజ్జాడ దేవికి తిరుపతి రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ చెప్పారు. ఈమెపై గతంలో ఏమైన కేసులు ఉన్నాయా? నేర చరిత్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె భర్త మధు బెంగళూరులోని ఒక బేకరీలో పనిచేస్తున్నాడు. అతన్ని విచారించడానికి బెంగళూరుకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. మరోవైపు ఆమె ఉంటున్న రాజమండ్రి, రాజానగరంలో ఇతరత్రా వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందాలను పంపారు.

టీటీడీ బోర్డు మాజీ సభ్యులు నిబంధనలు పాటించాలి

తిరుమల, మార్చి11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులకు ఏడాదిలో కొన్నిసార్లు మాత్రమే వారి కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉందని టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే కొందరు ఈ నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యులతో కాకుండా ఇతరులను వెంట బెట్టుకుని శ్రీవారి దర్శనం కోసం పదే పదే రావడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మాజీ బోర్డు సభ్యులు ఆ హోదాలో ఇతరులను వెంట బెట్టుకుని వస్తే దర్శనానికి అనుమతించేది లేదని తెలిపారు.

రాళ్లపల్లె ఈతరం పరిశోధకులకు స్ఫూర్తి

ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: తెలుగు సాహిత్యంలో వచన శైలికి జిలుగులు దిద్దిన రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ ఈ తరం పరిశోధకులకు స్ఫూర్తిని అందిస్తున్నారని ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఓఆర్ఐలో సోమవారం నిర్వహించిన రాళ్లపల్లె వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాళ్లపాక కవుల సంకీర్తనలను రాళ్లపల్లె పరిష్కరించడమే కాక, స్వరకల్పన చేశారన్నారు. వందల సంకీర్తనలను స్వరపరిచి పుస్తక రూపంలోనూ వెలుగులోకి తెచ్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఓఆర్ఐతోనూ రాళ్లపల్లెకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఎస్వీయూ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు రాఘవశర్మ, ఓఆర్ఐ సిబ్బంది రాజశేఖర్, విజయ్ పాల్గొన్నారు.



రాళ్లపల్లె చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు

అన్నమాచార్య కళామందిరంలో..



తిరుపతి (కల్చరల్), మార్చి 11 : రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ 45వ వర్ధంతిని సోమవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించారు. రాళ్లపల్లి వారికి సంగీత, సాహిత్యాలలో సమానమైన ప్రజ్ఞ ఉండేదని వక్తలు అభిప్రాయపడ్డారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ అధ్యక్షత వహించారు. రాళ్లపల్లి మనవరాలు, సంస్కృత వర్సిటీ ఆచార్యులు రాళ్లపల్లి దీప్తి మాట్లాడుతూ దాదాపు రెండువేల అన్నమయ్య కీర్తనలను రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ పరిష్కరించారన్నారు. ప్రముఖ గాయకురాలు ఎన్.సి.శ్రీదేవి రాళ్లపల్లి స్వీయకృతులు అనే అంశంపై ప్రసంగించారు. ఉదయం 9 గంటలకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మార్గంలోని రాళ్లపల్లి విగ్రహానికి టీటీడీ డీఈవో భాస్కర రెడ్డి, విభీషణశర్మ, రాళ్లపల్లి దీప్తి, ఇతర అధికారులు పుష్పాంజలి ఘటించారు.

కల్యాణ వైభోగమే..

శ్రీకాళహస్తి, మార్చి 11: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీజ్ఞానప్రసూనాంబిక, శ్రీకాళహస్తీశ్వరస్వామి కల్యాణోత్సవం, నటరాజ స్వామికి సోమవారం జరిగిన కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. విశేషంగా భక్తులు తరలివచ్చారు.



పూజలు చేస్తున్న అర్చకులు







నటరాజస్వామికి అభిషేకం, ఒక్కటవుతున్న జంట

'పులికాట్ పూడికతీత' మళ్లీ వాయిదా

తడ, మార్చి 11: పులికాట్ పూడికతీత శంకుస్థాపన మళ్లీ వాయిదా పడింది. పులికాట్ సరస్సు పూడిక తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 97.09 కోట్ల వ్యయంతో ఈ పనులు చేయాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన అనుమతులను పొందారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి మరికొన్ని అనుమతులు రావాల్సి ఉన్నట్లుగా ప్రచారంలో ఉంది. దాంతోపాటు ఈపనులకు టెండర్ల ప్రక్రియ వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవేమీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో హఠాత్తుగా ఈ పనులకు శ్రీకారం చుట్టేందుకు నిర్ణయించారు. గత ఏడాది నవంబరు 21వ తేదీ సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన అంటూ హడావుడి చేశారు. ప్రకృతి కరుణించకపోవడంతో అప్పట్లో అది వాయిదా పడింది. మళ్లీ మూడున్నర నెలలపాటు ఈ విషయం పక్కన పెట్టేశారు. మరో రెండు, మూడ్రోజు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో ఈ విషయం మరోసారి తెరపైకివచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం శంకుస్థాపనను సీఎం వర్చువల్‌గా చేస్తారంటూ సోమవారం తడలో ఏర్పాట్లు చేసే పనిలోపడ్డారు. ఏమైందో ఏమో కానీ మధ్యాహ్న సమయానికి ఇది కూడా వాయిదాపడింది. త్వరలోనే సీఎం ఈ పనులకు శంకుస్థాపన చేస్తారంటూ అధికారులు ప్రకటించారు.

నేటినుంచి రంజాన్ దీక్షలు

సత్యవేడు, మార్చి 11: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభమైంది. ఈ నెల ప్రారంభాన్ని సూచించే నెలవంక సోమవారం సాయంత్రం దర్శనమివ్వడంతో మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి.ఈ నెలలో ముస్లింలు తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు. మసీదుల్లో ఐదువేళలా ప్రార్థనలతో పాటు పవిత్ర తరావీహ్ నమాజు, ఖురాన్‌లను పఠిస్తారు.నెలవంక తిరిగి దర్శనమిచ్చేంతవరకూ ఈ ఉపవాస దీక్షలను పాటిస్తారు.గల్ఫ్ దేశాల్లో నెలవంక ఆదివారం దర్శనమివ్వగా సోమవారం నుంచి దీక్షలు ప్రారంభం కాగా భారతకాలమానం ప్రకారం వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 6.40 నుంచి 6,52 గంటల వరకు నెలవంక దర్శనమిచ్చింది.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, మార్చి 11: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ సంఘమేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో కేంద్ర, పోలీసు బలగాలు కవాతు నిర్వహించి, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ

గూడూరు, మార్చి 11: తూర్పువీధిలోని సరస్వతి శిశుమందిరం పాఠశాలకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బెంచీలను సోమవారం వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్‌బాబు, తాళ్లూరు శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, గిరిబాబు, సిద్దారెడ్డి, రవిచంద్ర, హెచ్‌ఎం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత చెక్ పంపిణీ

గూడూరు అర్బన్: మార్చి 11: ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని లబ్ధిదారులైన మహిళలకు వైఎస్సార్ చేయూత మెగా చెక్‌ను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పంపిణీ చేశారు. నాల్గవ విడత కింద 3728 మంది మహిళలకు రూ.6.99 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు వూటుకూరు యామిని, ఎంపీపీ గురవయ్య, వూటుకూరు మహేంద్రరెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోండి: సీపీఐ

వెంకటగిరిటౌన్, మార్చి 11: చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లిపాటి బాల కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 600 ఎకరాల చెరువుల భూములను కబ్జా చేసి, అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. వీరికి ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే మహా ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. వడ్డిపల్లి చెంగయ్య, అంకయ్య, మునేంద్ర, సాయికుమార్, అజయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

నాయుడుపేట టౌన్, మార్చి 11: పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు కొనసాగు తున్నాయి. సోమవారం నీలకంఠేశ్వరస్వామి వార్లకు స్వర్ణముఖినదిలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రేపు నేదురుమల్లి విగ్రహావిష్కరణ

వాకాడు, మార్చి 11: మండలంలోని స్వర్ణముఖీ నదీ తీరంలో బుధవారం మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు



చంద్రగిరి, మార్చి 11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముండ్లూరి బాలకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రయాణికులు సురక్షితం



కోట, మార్చి 11: విద్యానగర్ బాలభారతీ పాఠశాల సమీపంలో సోమవారం రాత్రి ఒక కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు స్వల్పంగా దెబ్బతినగా.. అందులోని నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా వాకాడు మండలానికి చెందినవారని సమాచారం.

స్వపక్షమే విపక్షమై..!

నాయుడుపేట మున్సిపల్ సమావేశంలో ప్రశ్నలు సంధించిన వైసీపీ కౌన్సిలర్లు

నాయుడుపేట, మార్చి 11: స్వపక్షమే విపక్షమైంది. నాయుడుపేటలో సోమవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు పలు ప్రశ్నలను సంధించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఆరో వార్డు కౌన్సిలర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అందరు కౌన్సిలర్లకు రూ.10లక్షల వంతున అభివృద్ధి పనులకు కేటాయించి, తనకు మాత్రం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎన్నికలకు పోలేమన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి మాట్లాడుతూ.. తన వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కరించేదెప్పుడని ప్రశ్నించారు. నామినేషన్ ప్రకారం అనుమతిస్తే తానే పనులు చేసుకుంటానని చెప్పారు. పట్టణం అంతా గ్యాస్‌పైపులైన్ల నిర్మాణంతో సిమెంట్ రోడ్లన్నీ ధ్వంసమైపోయాయని.. మరమ్మతులు ఎప్పుడు చేస్తారన్నారు. మున్సిపాలిటీ విలువైన ప్రాంతాల్లో ప్రైవేట్ ఏటీఎంలకు విచ్చలవిడిగా అనుమతులు ఎవరిచ్చారని, పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కోఆప్షన్ మెంబరు చదలవాడ కుమార్ కోరారు. అలాగే మొదటి అంతస్తులోని 28 దుకాణాల అద్దెలు రూ.4,100 నుంచి రూ.2వేలకు తగ్గించాలన్నారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ. అందరి సమస్యలను అజెండాలో చేరుస్తామని చెప్పారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న దీపిక

ఇంటి స్థలం ఇవ్వలేదు.. అయినా ఇచ్చినట్లు కరపత్రం

నాగలాపురం, మార్చి 11: ఇంటిస్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్లు కరపత్రం చూసి ఓ లబ్ధిదారుడు షాక్‌కు గురయ్యాడు. నాగలాపురం మండలంలోని సురుటుపల్లె గ్రామ పంచాయతీకి చెందిన కస్తూరి నాయుడు కండ్రిగ గ్రామంలోని ఎన్.అయ్యప్ప అనే వ్యక్తికి రెండవ జాబితాలో ఇంటి స్థలం మంజూరైంది. ఆన్‌లైన్లో ఇంటి స్థలానికి అర్హుడుగా అతని పేరు నమోదై ఉంది. అయితే అతడికి ఇంతవరకు స్థలం కేటాయించలేదు. స్థలం చూపాలని ఏడాదిగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేక పోయింది. కాగా రెండు రోజుల క్రితం అయ్యప్పకు 'గడప గడపకూ సంక్షేమం' పేరిట కరపత్రాన్ని వలంటీర్ అందించారు. అందులో అతనికి ప్రభుత్వం తరపున రూ.2లక్షల విలువ గల ఇంటి స్థలాన్ని అందించినట్లు ముద్రించి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు.

ప్లాట్లు ఉన్నా ఇవ్వరెందుకు?

కస్తూరినాయుడు కండ్రిగ గ్రామంలో ఇంకా కొందరికి ఇంటి స్థలాలు ఇవ్వలేదు. వీరు సచివాలయ అధికారులను అడిగితే స్థలాలు లేవు అందుకే ఇవ్వలేదు అని సమాధానమిస్తున్నారు. వాస్తవానికి సుమా రు 7 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. స్థానికంగా ఉన్న ఓ అధికార పార్టీనేత లబ్ధిదారులకు ఈ ప్లాట్లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ గ్రామానికి చెందిన ఎస్టీకాలనీలో ఎస్టీలకు చెందిన చాలా ఇండ్లను స్థానిక అధికార పార్టీ నేత తమిళనాడు వాసులకు భారీగా అమ్మినట్లు సమాచారం.



ఖాళీగా ఉన్న జగనన్న ప్లాట్లు

ఇవ్వకుండానే ఇచ్చినట్లు చూపించారు

నేను 16 సంవత్సరాలుగా కస్తూరి నాయుడు కండ్రిగలోని మా అన్నగారింట్లో నివసిస్తున్నాను. నాకు ఇంటి స్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్లు అసత్య ప్రచారాలు చేసే జగనన్నను మేము ఎలా నమ్మాలి?

- ఎన్.అయ్యప్ప, కస్తూరి నాయుడు కండ్రిగ,



ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



కేవీబీపురం, మార్చి11: కేవీబీ పురం ఎంపీడీవోగా రెడ్డెప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కేవీపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాల య సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాలువను కబ్జా చేశారు

తిరుపతి కలెక్టరేట్, మార్చి11: తమ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని కాలువను తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించాడని తొట్టంబేడు మండలం పెద్దకన్నలికి చెందిన రామచంద్రారెడ్డి స్పందనలో ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో అధికారులకు వినతిపత్రం అందించారు. విచారణ జరిపి కాలువను కబ్జా నుంచి రక్షించాలని కోరారు.

ఇద్దరు పిల్లల తండ్రికి.. వసతి దీవెన ఇచ్చారట..!

- 2016లో డిగ్రీ పూర్తిచేశారు..
- ఇప్పుడు వసతి దీవెన ఎలా సాధ్యం..?



కరపత్రం చూపుతున్న పృథ్వీ

సత్య వేడు, మార్చి 11: గడప గడపకు సంక్షేమం పేరుతో ప్రజలకు వైసీపీ ప్రభుత్వం అంది స్తున్న కరపత్రాలు అబద్ధపు ప్రచారాలకు నిలువు టద్దంలా నిలుస్తున్నాయన్న విమర్శలు వినబడుతు న్నాయి. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న వైసీపీ ప్రచారంపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సత్యవేడు-1 సచివాలయం పరిధికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు చిట్టేటి పృథ్వీకి వసతి దీవెన పథకం కింద రూ.10,800లు ప్రభుత్వం ఇచ్చినట్లు కరపత్రాన్ని సంబంధిత వలంటీరు కరపత్రాన్ని ఇచ్చారు. అదిచూసిన ఆయన షాక్‌కు గురయ్యాడు. తాను 2016 లోనే డిగ్రీ పూర్తి చేశానని, వసతి దీవెన తనకు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నాడు. ఎంబీఏ మధ్యలో మానేసి 2018లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఇద్దరు పిల్లలకు తండ్రి.

రోజాకు సీటిస్తే ఓడిస్తాం

- వైసీపీ నేతల హెచ్చరిక



కరపత్రాలు చూపుతున్న వైసీపీ నేతలు

తిరుపతి సిటీ, మార్చి 11 : నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి, అన్నదమ్ములను అడ్డం పెట్టుకుని మంత్రి రోజా అక్రమ సంపాదనకు తెరలేపారని, పార్టీ నేతలకు అండగా ఉండకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైసీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మురళి ఆరోపించారు. నగరి నియోజకవర్గంలోని వైసీపీ నేతలతో కలిసి ఆయన సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎంతో శ్రమించి ఆమెను ఎమ్మెల్యేగా గెలిపించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలనే ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. చిన్న పని కోసం అధికారుల దగ్గకు వెళ్లినా 'మంత్రి గారిని లేదా వాళ్ల అన్నదమ్ములను కలవండి.. వారు చేప్తేనే చేస్తాం' అని చెబుతున్నారని వాపోయారు. రోజా అన్నదమ్ములను కలిస్తే డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కాయంగుట్ట పంచాయతీలో జగనన్న కాలనీ పేరుతో గ్రావెల్ తరలించి రూ.కోట్లు సంపాదించిన విషయం నియోజకవర్గంలో ఎవర్ని అడిగినా చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమెకు సీటు ఇస్తే ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జయచంద్రారెడ్డి, మునీంద్ర పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



హేమచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థులకు విధిగా బోధించి వారి ప్రతిభకు మెరుగులుదిద్దే విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనాంశంగా మారడమే నిదర్శనమని అన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామమన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ ఈ అంశంపై అర్థవంతమైన చర్చ సాగి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏకి చెందిన జినామిక్స్ బయోటెక్ ప్రతినిధి అలోక్ పాండే, మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి హసీనా కరీమా, సదస్సు నిర్వాహకులు ఉష, భార్గవి పాల్గొన్నారు.

తిరుపతి నుంచి పలు రైళ్ల రద్దు

తిరుపతి సెంట్రల్, మార్చి11 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆధునీకీకరణ పనుల కారణంగా సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

- పాండిచ్చేరి-తిరుపతి మధ్య నడుస్తున్న (16112-16111)రైళ్లను ఈనెల 24వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-మంగళూరు మధ్య నడుస్తున్న వారాంతపు రైలును (174070) ఈనెల 15 వరకు రద్దు చేశారు.
- తిరుపతి-అరక్కోణం మధ్య నడిచే (06753-06754), చెన్నై-తిరుపతి మధ్య నడుస్తున్న (06728-06727) ప్రత్యేక రైళ్లను తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 14వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-చెన్నై మధ్య నడుస్తున్న రోజువారి ఎక్స్‌ప్రెస్‌లు(16057-16058, 16054-16053) 23వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నాలుగు రైళ్లు రేణిగుంట-చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.
- నిజాముద్దీన్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(12644) ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు తిరుపతికి రాకుండా రేణిగుంట నుంచి అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(12646) మంగళవారం నుంచి 19వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ● బెంగళూరు నుంచి టాటానగర్, హటియాల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు 21వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తాయి. ● కాచిగూడ-మధురై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07191) ఈ నెల 18వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తుంది.

ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన జగన్

- సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల



వేదికపై నెలవల, పరసారత్నం, విజయశ్రీ, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, మార్చి 11 : సీఎం జగన్ తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, జనాన్ని మోసం చేశారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలులో సోమవారం రాత్రి టీడీపీ అభ్యర్థి విజయశ్రీ పరిచయ వేదికలో మాజీమంత్రి పరసా వెంకటరత్నంతో కలసి పాల్గొన్నారు. నెలవల మాట్లాడుతూ.. రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అభ్యర్థి విజయశ్రీని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి.. అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కామిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులునాయుడు, ఆకుతోట రమేష్, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, కట్టా వెంకటరమణారెడ్డి, 786 రఫీ, సుజాతమ్మ, గంగాప్రసాద్, దార్ల రాజేంద్ర, నెలవల రాజేష్, అప్పాడి సుబ్బరాయుడు, పరసా రాజా, గోనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



సూళ్లూరుపేటలో ధ్రువపత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న కిలివేటి

దొరవారిసత్రం, మార్చి 11: దొరవారిసత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందజేశారు. మండలంలో 39 లేవుట్‌ల్లో 554 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, తహసీల్దారు ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజు, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తడ, సూళ్లూరుపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో నిర్లక్ష్యం వీడండి



సభ్యురాలికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీసీ, ఏపీఎం

కోట, మార్చి 11 : స్త్రీనిధి రుణాల రికవరీలో నిర్లక్ష్యం వీడాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎంచేమూరి రత్నయ్య హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వీవోఏలు, సీసీలతో ఈ అంశంపై సమీక్షించారు. ఈనెల 24వ తేదీలోపు రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. వెనుకబాటు వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రుణాలు సకాలంలో చెల్లించిన సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సీసీలు కృష్ణమ్మ, భాస్కర్, శంకరయ్య, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణకు యువకుడి యత్నం

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

కోట, మార్చి 11 : ఓ బాలిక అపహరణకు యత్నించిన యువకుడిని పట్టుకుని స్థానికులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. చెందోడు పంచాయతీలో ఎనిమిదేళ్ల బాలికను మద్యం మత్తులోని ఓ యువకుడు అపహరించడానికి యత్నించారు. అక్కడున్నవారు గమనించి కేకలు వేయడంతో పరుగుతీశాడు. స్థానికులు వెంబడించి అతడిని పట్టుకుని దేహశుద్ధిచేసి.. పోలీసులకు అప్పగించారు. కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

మద్యం దుకాణంలో రూ.6లక్షల చోరీ

గూడూరు, మార్చి 11: మండలంలోని కొండాగుంటలో ఉన్న మద్యం దుకాణంలో రూ.6లోల చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణంపై ఉన్న రేకులు తొలగించి, లోనికి ప్రవేశించారు. అనంతరం దుకాణంలోని రూ.6లక్షలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం దుకాణాన్ని సిబ్బంది తెవరగా, చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తొలగించిన దుకాణం రేకులు

పుత్తూరు వార్తలు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బుట్టిరెడ్డి కండ్రిగ ఆర్వో ప్లాంట్ ప్రారంభించి, పూజ చేస్తున్న మంత్రి రోజా

వడమాలపేట, మార్చి 11: గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆర్కే రోజా ఆదేశించారు. సోమవారం మండలంలోని బుట్టిరెడ్డి కండ్రిగలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. అలాగే కామాల వారింద్లకు రూ.50 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ దహనవాటిక ప్రారంభం

పుత్తూరు: మున్సిపాలిటీలో రూ.కోటి యాభై లక్షలతో నిర్మించిన గ్యాస్ దహనవాటిక, అనుబంధంగా రూ.ఏడు లక్షలతో సిద్ధమైన కర్మక్రియల భవనాలను సోమవారం మంత్రి రోజా ప్రారంభించారు. త్వరలో ధార్మికుల సాయంతో శవవాహనం, ఫ్రీజర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం శ్మశాన వాటికలో ఇరవై అడుగుల శివుడి విగ్రహాన్ని కూడా ఆమె ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైసీపీ నాయకులు మాహీన్, జయప్రకాష్, శంకర్, నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 11: టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని నెత్తం దళితవాడకు చెందిన యువత.. పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకుంది. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదని ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ విడుదల చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్ ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతున్న తరుణంలో కేవలం ఆరు వేల ఉద్యోగాలతో డీఎస్సీ ప్రకటించడం కంటి తుడుపు నిర్ణయంగా అభివర్ణించారు. స్వయం ఉపాధి పథకాలను కూడా రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు జగన్ సర్కార్ తీరని ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ప్రభుత్వ ప్రైవేట్ రంగంలో 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి, నిరుద్యోగులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ భృతిని పునరుద్ధరిస్తామన్నారు. నమ్మి ఓటేసి గెలిపించినందుకు ఈ ఐదేళ్లలో దళితులపై జరిగినన్ని దాడులు మరో సామాజిక వర్గంపై జరగలేదని వాపోయారు. నగరి నియోజకవర్గం అభివృద్ధి బాధ్యత తనదని.. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో.. నెత్తం దళితవాడకు చెందిన సతీష్, చిన్నా, దయాకర్, సురేష్, రమేష్, దినేష్, మణికంఠ, వెంకటేష్, అశోక్, అజయ్, ప్రదీప్, యుగంధర్, చరణ్, రాజేష్, బాలముని, తులసి, విక్రమ్, గుణ, శేఖర్, హరి, సంతోష్, భాను, నవీన్, వినోద్, శ్రీకర్, బాలసుబ్రమణ్యం, సురేష్, భార్గవ్, విజయ్, దినేష్, పి.అంకయ్య, శశి, కిషోర్, దిలీప్, తరుణ్ ఉన్నారు.



టీడీపీలో చేరిన యువతతో గాలి భానుప్రకాష్

14న రైతాంగ పోరాటాలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, మార్చి 11: మండల కేంద్రాల్లో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న రైతాంగ పోరాటాలను జయప్రదం చేయాలని పుత్తూరు జిల్లా సమితి సభ్యుడు డి.మహేష్ కోరారు. సోమవారం అంబేడ్కర్ భవనంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు చంద్రబాబు, నాయకులు కృష్ణారెడ్డి, వర్మ, ఆకాష్, సీఐటీయూ నేతలు విజయ్, రమేష్, వెంకటేష్, ప్రజా సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

నారాయణవనం, మార్చి 11: పాలమంగళం నార్త్ పంచాయతీ యానాది కాలనీలో సోమవారం పూరిల్లు దగ్ధమైంది. కాలనీలోని శక్తివేలు పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబీకులు బయటకు వెళ్లిపోవడంతో ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మునిశంకర్ ఈ సందర్భంగా కోరారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

బాండ్ల వివరాలను ఎస్‌బీఐ ప్రకటించాలి : సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సత్యవేడు, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తక్షణమే ప్రకటించాలని నియోజకవర్గ సీపీఎం కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు సోమవారం సత్యవేడులో స్థానిక ఎస్‌బీఐ వద్ద స్థానిక నేతలతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాండ్ల వివరాలు తెలియజేసేందుకు గడువు కోరడం అంటే లోక్‌సభ ఎన్నికలు అయ్యే వరకు ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చూడడం ఎస్‌ఐబీ ముఖ్య ఉద్దేశం అని తెలుస్తోందని విమర్శించారు. ఎస్‌బీఐ అధికార బీజేపీకి లాభం చేకూర్చేలా వ్యవ హరించడం తగదన్నారు. వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగరాజు, మురళి, మునస్వామి, శేఖర్, మంజుల, కృష్ణయ్య, కేశవులు, సుశీల పాల్గొన్నారు.

దక్షిణ కైలాసంలో ముక్తిధామం ప్రారంభం


ముక్తిదామం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, మార్చి 11: శ్రీకాళహస్తి శ్మశాన వాటికలో కైలాసం ముక్తి ధామం నిర్మించడం ఎంతో పుణ్యప్రదమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం స్వర్ణముఖి నదిలో నిర్మించిన కైలాసం ముక్తి దామం భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వైయస్సార్ చేయూత నగదు చెక్కు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సేవలో స్కౌట్ విద్యార్థులు



శ్రీకాళహస్తి, మార్చి 11: ముక్కంటి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్స వాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు విశేష సేవలు అందించారు. మహాశివరాత్రి పర్వదినం, రథోత్సవం, తెప్పోత్సవం, శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో అత్యధిక సంఖ్యలో భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ భక్తులకు స్వచ్ఛందంగా సేవలందించారు.

విద్యుత్ షాక్‌తో వలంటీర్ భర్త మృతి


మృతుడు చంద్రబాబు (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, మార్చి 11: మండల పరిధిలోని బైటకొడియంబేడు గ్రామంలో విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుని బంధు వుల కథనం మేరకు.. బైటకొడియంబేడుకు చెందిన వలంటీర్ భర్త చంద్రబాబు ఆదివారం సాయం త్రం చింత కాయలు రాల్చడానికి చింత చెట్టు ఎక్కాడు. చెట్టుపై విద్యుత్ తీగను గమనించక పోవడంతో విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై కింద పడ్డాడు. గమనించిన స్థానికులు నాగలా పురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ ఓబయ్య కేసునమోదు చేశారు. సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎపుడో వేసిన రోడ్డుకు.. ఇప్పుడు శిలా ఫలకాలు..!


వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా వేసిన లాఫలకం

రేణిగుంట, మార్చి 11: రేణిగుంట పంచాయతీలో ఎపుడో వేసిన సీసీ రోడ్లకు నేడు శిలఫలకాలు వేస్తున్నారు. రేణిగుంట పంచాయతీ పాలక వర్గం ఏర్పడి దాదాపు మూడేళ్లవుతోంది. సర్పంచు నుంచి వార్డు మెంబరు వరకు సింహభాగం ఇనాన మస్‌గా గెలుపొందిన వారే. 2022, 2023 కాలంలో వేసిన ఎనిమిది రోడ్లకు ఇప్పుడు శిలాఫలకాలు వేస్తుండడం గమనార్హం.

నిరంతర భద్రత కొనసాగాలి : కలెక్టర్


ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

రేణిగుంట, మార్చి 11: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్ర పరచిన గోదాము వద్ద నిరంతరం భద్రత యథావిధిగా కొన సాగాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. పీవో, ఏపీవోల శిక్షణ కోం వినియోగించనున్న డెమో ఈవీఎంలను అత్యంత భద్రత నడుమ సంబంధిత రెవెన్యూ డివిజన్లకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రేణిగుంట విమా నాశ్రయం సమీపంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాము వద్ద భద్రపరచిన ఈవీఎం గోదామును రాజకీయ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం గోదాము ఇన్‌చార్జి కోదండరామిరెడ్డి, ఎన్నికల సెల్ అధికారులు చంద్రశేఖర్, పవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీకి చెందిన మనోహరాచారి, వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి చిరంజీవి పాల్గొన్నారు.

మహిళా టీచర్లకు సన్మానం



నాగలాపురం, మార్చి 11: నాగలాపురం ఎమ్మార్సీ ఆవరణలో సోమవారం ఎంఈవో బాబయ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో కేంద్ర బలగాల కవాతు



పిచ్చాటూరు, మార్చి 11: పిచ్చాటూరులో సోమవారం సాయంత్రం పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి మొత్తం 3 కంపెనీల (ఒక కంపెనీ అంటే 100 మంది) సాయుధ బలగాలు ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు. అందులో ఒక కంపెనీ కేంద్ర బలగాలతో సోమవారం సాయంత్రం పిచ్చాటూరుతో పాటు నీరువాయి గ్రామం, దళితవాడల్లో కవాతు నిర్వహించామన్నారు. ఈ వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కవాతులో ట్రైనీ డీఎస్పీ సింధు, సీఐ భాస్కర్‌నాయక్, పిచ్చాటూరు, కేవీబీ పురం ఎస్‌ఐలు వెంకటేశ్వరులు, సయ్యద్ మహ్మద్, షరీఫ్, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

14న వేలంపాట

వరదయ్యపాళెం, మార్చి 11: వరదయ్యపాళెంలో పలు దుకాణ సము దాయాలు, మార్కెట్‌కు ఈ నెల 14న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బసిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బస్టాండు, దినసరి కూరగాయల మార్కెట్, మాంసపు దుకాణాలు, వాణిజ్య సముదాయంలోని 1 నుంచి 25 వరకు గదులు(24వ నెంబరు మినహా, వరదయ్యపాళెం చేపల చెరువుకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్

వరదయ్యపాళెం, మార్చి 11: ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ యోజన పథకం ద్వారా శ్రీలక్ష్మి భారత్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు 30 మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు వేలూరు పురు షోత్తం ఆధ్వర్యంలో కనెక్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు సిద్ధులయ్య, సుబ్బరత్నమ్మ, ఢిల్లీ ప్రకాష్, సూర్యనారాయణ, మునస్వామి, రాంబాబు, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రామరాజ్యం : టీడీపీ

తొట్టంబేడు, మార్చి 11: రాష్ట్రంలో రాక్షస పాలన ముగిసి రెండు నెలల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో రామరాజ్యం రానుందని ఆ పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి తెలియజేశారు. సోమవారం మండలంలోని చిట్టత్తూరు పంచాయతీలో ఆమె ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు పద్మ, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, నాయకులు మురళి నాయుడు, మునిరాజనాయుడు, ప్రతాప్‌రెడ్డి, బాలాజీరెడ్డి, చంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై వెంకన్న విహారం



తొట్టంబేడు, మార్చి 11: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్ పురం గ్రామంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్స వాలలో భాగంగా సోమవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తొట్టంబేడు, మార్చి 11: సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా నాగోలు వెంకటరమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ నిర్మల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. సర్పంచులంతా కలిసి అధ్యక్షుడిగా వెంకట రమణా రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్బయ్య, సుజాత, సక్కుబాయమ్మలను, కార్యదర్శిగా సుబ్రమణ్యంను, ట్రెజరరీ కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, వైస్‌ఎంపీపీ మల్లిక, నాయకులు వాసుదేవనాయుడు, ఎంపీడీవో ప్రవీణ్, ఈవో పీఆర్డీ తరుణాక్షిరెడ్డి పాల్గొన్నారు.

ఆట వస్తువులు, ఫర్నిచర్ వితరణ


ఆటవస్తువులను అందజేస్తున్న ప్రగతి సంస్థ సిబ్బంది

ఏర్పేడు, మార్చి 11: ప్రగతి సంస్థ ద్వారా అంగన్వాడీ సెంటర్లకు ఆటవస్తువులు, ఫర్నిచర్‌ను సన్ టీవీ సాయంతో బెంగళూరుకు చెందిన క్రైసంస్థ సహకారంతో పాయల్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రానికి అంద జేశారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపి ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేణిగుంట, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని 12 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ వస్తువులను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ప్రాథమిక వైద్యశాల డాక్టర్ మధురిమ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, చివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ప్రగతి సిబ్బంది నితీష్, సుభాష్, సుమలత, రాజేశ్వరి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌ను గెలిపించండి


ప్రచారం నిర్వహిస్తున్న మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి

ఏర్పేడు, మార్చి 12: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున కోలా ఆనంద్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కందాడు పంచాయతీ ఎస్టీకాలనీలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈగల బాలాజీరాయల్, సుధాకర్, బాలగురవయ్యాయాదవ్, మణియాదవ్, శ్రీనివాస్‌యాదవ్, దామోదర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: కేంద్ర ప్రభుత్వ నిధులతో వైసీపీ ప్రచారం చేసుకుంటోందని శ్రీకాళహస్తి నియోజకవర్గ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి అన్నారు. తంగేళ్లపాళెంలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెడెం క్రిష్ణయ్య, బాలాజీ, సుబ్బరామిరెడ్డి, లోకేష్‌రెడ్డి, రవిఆచ్చారి, మునిరాజ, రవిచంద్ర, బిందు కుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సత్యవేడు, మార్చి 11: ఈ నెల 16న సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు ఆవ రణలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జడ్జి వి.గోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నృత్యం..సమ్మోహనం



నేరేళ్ల వరలక్ష్మి కళ్యాణి, భక్తిరంజని ● గాయత్రి బృందం సంగీత కచ్చేరి


శ్రీవల్లి, సుదీప్త బృంద నృత్యప్రదర్శన

శ్రీకాళహస్తి, మార్చి 11: శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం దూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జోతి ప్రజ్వలన అనంతరం వెదళ్ల చెరువుకు చెందిన కోదండపాణి చేసిన భక్తిరంజనితో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. తర్వాత తెనాలికి చెందిన నేరేళ్ల వరలక్ష్మి కళ్యాణి, భక్తిరంజని, విశాఖపట్టణానికి చెందిన రూప కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేశారు. ఒడిశా, మణిపురికి చెందిన శ్రీవల్లీ, సుదీప్త బృంద నృత్యప్రదర్శన అబ్బురపరిచింది. చెన్నైకి చెందిన గాయత్రి బృందం, ఆన్ స్టాపబుల్ ఫ్యూజన్ ఉర్రూతలూగించింది. మంగళగిరికి చెందిన తిరుమల కళ్యాణి బృందం నృత్య ప్రదర్శన, శ్రీకాళహస్తికి చెందిన శ్రీవిద్య బృందం నృత్య ప్రదర్శన. చెన్నైకు చెందిన నృత్యాంజలి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. పెద్దకనపర్తికి చెందిన అంకమ్మ నాట్య మండలి పెంచలయ్య బృందం చేసిన చౌచౌ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. చివరిగా తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన జగన్నాథ నాట్య మండలి బృందం చేసిన సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనతో కార్యక్రమాలు ముగిశాయి. కళా కారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి ప్రసంశా పత్రాలు అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు...

కైలాస గిరిప్రదక్షిణ (పాల్గుణ శుద్ధ తదియ, మంగళవారం)
ఉభయదారులు : బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాళహస్తి

వాహనసేవలు...

ఉదయం 7:15 గంటలకు కైలాసగిరి ప్రదక్షిణ (కొండ చుట్టు) ప్రారంభం
రాత్రి 8 గంటలకు అశ్వం, సింహ వాహన సేవ

నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 4:00 గంటలకు, మంగళ వాయిద్యాలు
- ఉదయం 4:30 గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 5 నుంచి 7 గంటల వరకు మూడు కాలాల అభిషేకం
- ఉదయం 7: 15 గంటలకు, గిరిప్రదక్షిణ ఆరంభం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 9:30 గంటలకు దర్శనం ముగింపు
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు

ముక్కంటికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి, మార్చి 11: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని తిరువుడిమల్లం గ్రామంలో వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ మేరకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ చైర్మన్ సాయికుమార్ సోమవారం అధికారులతో కలిసి ముక్కంటి ఆలయానికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్ష చప్పరాలపై రుద్రుడి వైభవం


రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేస్తున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, మార్చి 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహా శివరాత్రి వార్షికోత్స వాలను పుర స్కరించుకుని సోమవారం ఉదయం ఆది దంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు. ఆది దంపతుల కల్యాణం ముగిసిన తరువాత ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అలంకార మండపంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిష్ఠింపజేసి పుర విహారానికి తీసుకు వచ్చారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీసిటీ సిబ్బంది సేవలు అభినందనీయం


శ్రీసిటీ ఇబ్బందితో ఆలయ చైర్మన్ బాలాజీరెడ్డి

నాగలాపురం, మార్చి 11: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో నిర్వ హించిన మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీసిటీ భద్రతా సిబ్బంది సేవలు అభినం దనీయమైందని ఆలయ చైర్మన్ బాలాజీరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పది రోజులు పాటు జరిగిన ఉత్సవాలకు, ప్రధానంగా మహా శివరాత్రి, స్వామి అమ్మవార్ల వివాహ వేడుకలు, గ్రామోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించారని తెలియజేశారు. తాము అడిగిన వెంటనే ఉత్సవాలకు సిబ్బందిని పంపిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వారి యాజమాన్యానికి ఆయనతో పాటు ఈవో రామచంద్రారెడ్డి, పాకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అశ్వ, సింహ వాహనసేవలు

శ్రీకాళహస్తి, మార్చి 11: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రాజగోపురం వద్ద నుంచి స్వామి వారు అశ్వ వాహనంపై అమ్మవారు, సింహ వాహనంపై అధిరోహించి పురవీధుల్లో భక్తులను అనుగ్రహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, మార్చి 11: మహాశివరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. సుమారు 21 కిలోమీటర్ల పొడవునా ఈ విశేషోత్సవాన్ని నిర్వహించనున్నారు. కైలాసగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని ఆలయ అధికారులు దాదాపు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు.

ముక్కంటి సేవలో క్రికెటర్ నవదీప్



శ్రీకాళహస్తి, మార్చి 11: ముక్కంటి ఆలయాన్ని క్రికెటర్ నవదీప్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పెండింగ్ వేతనాల కోసం ఎంపీడీవో కార్యాలయానికి తాళం


కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలేట్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11: వేతనాలు చెల్లించాలని మండలంలోని పారిశుధ్య కార్మికులు సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి తాళాలు వేశారు. గేటు బయట అడ్డుగా కూర్చుని సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 24 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 24 నెలలకు జీతాలు ఇవ్వాల్సి ఉండగా మండల స్థాయి అధికారులు ఒక నెలకు జీతాలు ఇస్తామని చెప్పడం శోచనీయమన్నారు. కనీసం పది నెలలు జీతాలు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవో షాలేట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకులు మునిచంద్ర, అన్నాదొరై, చంద్రబాబు, గంగయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

'మా భూమిని మాకు ఇప్పించండి'

● స్పందనలో దళితుల ఫిర్యాదు

వరదయ్యపాళెం, మార్చి 11: వరదయ్యపాళెం మండలం బత్తల వల్లం గ్రామానికి చెందిన దళితులు కె.మునిచంద్రశేఖర్, బి.వెంకట సుబ్బయ్య, పులి బేబమ్మ కలిసి తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భూసమస్యపై వినతిపత్రం సమర్పించారు. బత్తల వల్లం గ్రామంలో పలు సర్వేనెంబర్లలో ఉన్న 3.74ఎకరాల తమ భూమిని ఓ సంస్థ ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టిందన్నారు. సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని డీఆర్వో ఆదేశించారు.

ప్రమాదమని తెలిసినా..!



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11: గ్రామాలలో బస్సు సౌకర్యం లేకపోవడంతో బీఎన్ కండ్రిగ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునగా ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. సోమవారం ఉదయం బీఎన్‌కండ్రిగ ప్రధాన రహదారిపై ఒక ఆటోలో సుమారు 14 మంది ప్రయాణిస్తుండగా బయట నలుగురు విద్యార్థులు వేలాడుతూ ప్రయాణం సాగించారు. విద్యార్థులకు పట్టుతప్పితే అంతే సంగతి. సంబంధిత అధి కారులు స్పందించి పాఠశాలల వేళల్లో బస్సులు నడపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ఆటోవాలాలు పరిమితికి ప్రయాణికులను తరలించకుండా చూడాల్సి ఉంది.

ఈ సారి విజయం మనదే : నాని



యోగిమల్లవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 11: రానున్న ఎన్నికల్లో చంద్రగిరి కోటపై పసుపు జెండా ఎగరడం ఖాయమని చంద్రగిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి తెలియజేశారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ' కార్యక్రమంలో భాగంగా సోమవారం తిరుచానూరు పంచాయతీలో ఆయన పర్యటించారు. సూపర్‌సిక్స్ పథకాల క్యాలెండర్లను పంపిణీ చేశారు. పంచాయతీలో అండర్ డ్రైనేజీ, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డు, పింఛను కార్డులు సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఒక అవకాశం ఇస్తే తిరుచానూరు పంచాయతీ రూపురేఖలు మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, సాల్మన్‌రాజ్, కిషోర్‌రెడ్డి, జీవన్, వాసు, మునిరత్నంరెడ్డి, నాగూర్, సాయిరాయల్, ఖలీం, శివ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి వాటర్ కూలర్ల వితరణ



తిరుచానూరు, మార్చి 11: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి వాటర్ కూలర్లను దాతలు వితరణ చేశారు. ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ అధినేతలు పొట్టి వెంకటేశ్వర్లు, రాజమౌళి వాటర్ కూలర్లను సోమవారం ఆలయ సూపరింటెండెంట్ మధుకు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం విరాళంగా అందించినట్లు దాతలు తెలిపారు. ఆలయ అధికారులు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



తిరుచ్చిపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, మార్చి 11: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామి భూదేవి, శ్రీదేవి సమేత తిరుచ్చిపై కొలువుదీరి సోమవారం తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. ఇక సాయంత్రం అలంకార శోభితుడైన స్వామివారి ఉభయదేవేరిలతో బంగారు తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు,శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం చోద్యం..!


● గొడవను ఆపకుండా వీడియో తీసిన పోలీసులు



గొడవ పడుతున్న యువకులను వీడియో తీస్తున్న కానిస్టేబుల్
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

తిరుచానూరు, మార్చి 11: పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో అటు టీడీపీ, ఇటు వైసీపీ కార్యకర్తలు చిన్న విషయంపై మాటామాట పెరిగి గొడవకు దిగారు. ఇరువర్గాలు తీవ్ర స్థాయిలో గొడవపడుతుంటే వారిని వారించాల్సిన పోలీసులు మిన్నకుండిపోయారు. పైగా గొడవను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ కాలక్షేపం చేశారు. బాధితుడి కథనం మేరకు.. ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ దుకాణం వద్ద వైసీపీ కార్యకర్త చింతా హరి మద్యం మత్తులో తిరుచానూరు మిట్టవీధికి చెందిన జయకృష్ణతోపాటు మరొకరిపై దాడిచేశాడు. అయితే పోలీసులు హరిపై చర్యలు తీసుకోలేదు. జయకృష్ణపైనే చేయిచేసుకున్నారు. దీంతో వైసీపీ కార్యకర్త చింతా హరిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జయకృష్ణ, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత మధుశేఖర్, రాజేంద్ర, దిలీప్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు



హేమచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఇందులో ప్రతిభగల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థులకు విధిగా బోధించి వారి ప్రతిభకు మెరుగులుదిద్దే విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనాంశంగా మారడమే నిదర్శనమని అన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామమన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ ఈ అంశంపై అర్థవంతమైన చర్చ సాగి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏకి చెందిన జినామిక్స్ బయోటెక్ ప్రతినిధి అలోక్ పాండే, మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి హసీనా కరీమా, సదస్సు నిర్వాహకులు ఉష, భార్గవి పాల్గొన్నారు.

మూర్తిస్వామి ఎక్కడ ?

తిరుపతి క్రైం, మార్చి 11 : రేణిగుంట పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠం స్వామీజీ మూర్తి స్వామి అలియాస్ కోదండ రామాచార్యులు ప్రస్తుతం ఎక్కడున్నాడని పోలీసులు, ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడైన మూర్తిస్వామికి పలువురు మంత్రులు, సెలబ్రిటీలు, విదేశీయులతో సంబంధాలున్నట్లు సమాచారం. మారిషస్, మలేషియాలో తలదాచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో మూర్తిస్వామి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.మూర్తిస్వామి కోసం అన్ని విమానాశ్రయాలకూ లుకౌట్ నోటీసులు కూడా జారీచేయనున్నారు.ఎక్కడ కనపడితే అక్కడ పట్టుకుని రేణిగుంట పోలీసులకు అప్పగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నమ్మి.. నిండా మునిగాం!

» జగన్ సర్కార్ నిలువునా ముంచేసిందంటున్న సెర్ప్ ఉద్యోగులు

» వైసీపీ పెద్దలతో ఉద్యోగ సంఘ నేతలు కుమ్మక్కయ్యారని ఆగ్రహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



(ఫైల్ ఫొటో)

"మా ఉద్యోగ సంఘ నేతలే మమ్మల్ని ముంచేశారు. వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తుతూ ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాశారు. టీడీపీ హయాంలో కేడర్ ఫిక్సేషన్ చేస్తామంటూ అప్పట్లో సెర్ప్(గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) సీఈవో పిలుపునిస్తే మాకు కేడర్ ఫిక్సేషన్ వద్దు క్రమబద్ధీకరణే కావాలంటూ పట్టుబట్టారు. జగన్ వచ్చిన తర్వాత క్రమబద్ధీకరణ సాధిస్తామని చెప్పారు. ఇప్పుడేమో క్రమబద్ధీకరణ సంగతి సరే సరి... కనీసం కేడర్ ఫిక్సేషన్ చేయకుండా మొండిచేయి చూపారు" అంటూ సెర్ప్ ఉద్యోగులు మండిపడుతున్నారు. రాయలసీమకు చెందిన కొందరు ఉద్యోగ సంఘాల నేతలు వైసీపీ నేతలతో కుమ్మక్కై సుమారు 4 వేల మందికిపైగా ఉన్న సెర్ప్ సిబ్బందికి అన్యాయం చేశారని వాపోతున్నారు. క్రమబద్ధీకరణ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని, రెండేళ్ల నుంచి ఒక్క సారి కూడా సంఘం సమావేశం కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో ఆఫర్..

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ సెర్ప్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. గత ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేసి సెర్ప్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టడం సాధ్యం కాదని తేల్చేసింది. అందుకే వారికి ఉపశమనం కలిగించేందుకు గతంలో ఎప్పుడూ లేని విధంగా మిగతా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒక్కసారి 43 శాతం ఫిట్‌మెంట్ అమలు చేశారు. దీంతో సెర్ప్ ఉద్యోగులకు భారీగా జీతాలు పెరిగాయి. దీంతో పాటు కేడర్ ఫిక్సేషన్ చేస్తామంటూ అప్పట్లో సెర్ప్ సీఈవోగా ఉన్న కృష్ణమోహన్ ఉద్యోగ సంఘాల నేతలను పిలిచారు. అయితే కొంత మంది ఉద్యోగ సంఘాల నేతలు ఆయన చేసిన ఆఫర్‌ను కాలదన్నుకున్నారు. క్రమబద్ధీకరణ చేయాలని, లేకపోతే జగన్ సర్కార్ వచ్చిన తర్వాత రెగ్యులరైజేషన్ చేయించుకుంటామని తెగేసి చెప్పారు. దీంతో అప్పట్లో సెర్ప్ ఉద్యోగుల కేడర్ ఫిక్సేషన్ ఆగిపోయింది.

వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత....

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని 2019 ఎన్నికల ముందు జగన్ ప్రతి సమావేశంలోనూ హామీ ఇచ్చారు. సెర్ప్ ఉద్యోగ సంఘాల నేతలు ఆ హామీపై ఉద్యోగులను నమ్మించారు. తీరా జగన్ సీఎం అయిన తర్వాత కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియే ప్రహసనంగా మారింది. సెర్ప్ ఉద్యోగులు కాంట్రాక్టు ఉద్యోగుల కిందకు రారని జగన్ సర్కార్ తేల్చేసింది. దీంతో కనీసం కేడర్ ఫిక్సేషన్ చేయాలంటూ సెర్ప్ ఉద్యోగులు మొరపెట్టుకున్నారు. మరికొన్ని సమస్యలనూ ఏకరవు పెట్టారు. వాటిని ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. నెలనెలా జీతాలే సక్రమంగా ఇచ్చిన పరిస్థితులు లేకపోవడంతో విసిగిపోయిన సెర్ప్ ఉద్యోగుల జేఏసీ సెర్ప్ సీఈవోకు సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో సెర్ప్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. వారి క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఒక్కసారి కూడా సమావేశం కాలేదని వాపోతున్నారు.

ఇవీ డిమాండ్లు..

సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి అందులో పని చేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పేస్కేల్ అమలుచేసి క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. వారి సర్వీసు క్రమబద్ధీకరణకు ఆర్థికశాఖ ద్వారా సెర్ప్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా ఇచ్చిన మెమోను జీవో రూపంలోకి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం అమలవుతున్న ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసేసి మూలవేతనంపై 100 శాతం ఈపీఎఫ్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌సీలకు 12వ సెర్ప్ ఈసీ సమావేశంలో తీర్మానం ప్రకారం హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తూ... పేస్కేల్ వర్తింపచేయాలని, సపోర్టింగ్ స్టాఫ్, ఎల్2, ఎల్3తో పాటు అన్ని కేడర్లకు పదోన్నతి, ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. సెర్ప్ హెచ్ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపచేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాలు జరిపి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న గ్రాట్యుటీ రూ.16 లక్షలు, హెచ్ఆర్ఏ జీవోను సెర్ప్ ఉద్యోగులకూ అమలు చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

సజ్జల మాటలు నమ్మి సమ్మె విరమణ..

23 ఏళ్లుగా సెర్ప్‌లో పనిచేస్తున్న ఈ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కీలక పథకాలన్నీ అమలు చేస్తున్నారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, నాడు-నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణం, పేదలకు సుస్థిర జీవనోపాధుల పెంపుదల వంటి సంక్షేమ పథకాలు సెర్ప్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకుని సెర్ప్ ఉద్యోగుల డిమాండ్లను అన్నీ పరిష్కరిస్తామని, విధుల్లోకి చేరాలని సూచించారు. వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగ సంఘం నేతలు సజ్జల మాటలు నమ్మి సమ్మెను విరమింపచేశారు.

తాడేపల్లి ప్యాలెస్ వద్దకే రానీయట్లేదు..

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాయ మాటలు చెప్పి సెర్ప్ ఉద్యోగులను సమ్మె విరమింపచేశారని, ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ వద్దకు రానీయడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ ఉద్యోగ నేతల కారణంగానే తాము ఈ దుస్థితి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని ప్రతినిధులుగా ఎంచుకున్నందున దారుణంగా మోసపోయామని మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైసీపీ మాటున ఉద్యోగులకు చేసిన మోసం గ్రహించాలంటూ సెర్ప్ ఉద్యోగులు వాట్సప్ సందేశాలు పంపుతున్నారు.

ఎన్నికల తర్వాత విచారణ జరపండి

» హైకోర్టును కోరిన ఎంపీ రఘురామ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ కేవలం ప్రచారం కోసమే పిల్ దాఖలు చేసినట్లు 80శాతం ప్రతివాదులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పిల్‌పై ఎన్నికల తర్వాత విచారణ జరిపినా అభ్యంతరం లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం... పిల్‌ను వాయిదా వేయాలని కోరడానికిగల కారణాలను పేర్కొంటూ మెమో దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దుర్గా ప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. గతంలో పిల్ విచారణ సందర్భంగా ఈ వ్యాజ్యం విచారణార్హతపై ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీంతో పిల్ అడ్మిషన్‌కు ముందు ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సోమవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. సీఎస్ తరఫున ఏజీ వాదనలు వినిపిస్తూ పిల్‌ను పెండింగ్‌లో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం దానిని ఉపసంహరించుకొని ఎన్నికల తర్వాత దాఖలు చేసుకొనేలా ఆదేశించాలన్నారు. మరోవైపు పిటిషనర్ రఘురామ కూడా హైకోర్టుకు హాజరయ్యారు. కేసు విచారణ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌ని ఓడించడానికి ఎలాంటి వ్యూహాలు అవసరం లేదని, ఆయన చేసిన మోసాలను ప్రజలకు తెలియజేస్తే చాలని అన్నారు.

ఇండియా కూటమితోనే స్వేచ్ఛ

» బెదిరించడమే బీజేపీకి తెలిసిన పాలన: రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నేతృత్వంలోని ఇండియా కూటమి విజయంతోనే దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వెల్లివిరుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 'దేశంలో గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కరువైంది. మరోసారి అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో మను వాదాన్ని అమలులోకి తెస్తుంది. రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిన బీజేపీకి టీడీపీ, జనసేన, వైసీపీలు ఎందుకు మద్దతు ఇస్తున్నాయో ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

బీజేపీకి లొంగిపోయారు: సీపీఎం

పాలకొల్లు టౌన్, మార్చి 11: రాష్ట్ర విభజనకు కారణమైన బీజేపీతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి భాగస్వామ్యం కావడం దురదృష్టకరమని రాష్ట్ర సీపీఎం పేర్కొంది. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి, అన్యాయం చేసిన బీజేపీకి టీడీపీ, జనసేన లొంగిపోయాయంటూ మండిపడింది. 'రాష్ట్రానికి ప్రధాన శత్రువైన బీజేపీపై రాష్ట్రంలోని 2 ప్రధాన పార్టీలు గత ఐదేళ్లలో ఒక్క విమర్శ కూడా చేయలేదు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు, రాజధాని నిధులు గురించి నిలదీయలేదు' అని సీపీఎం విమర్శించింది.

రుషికొండ ప్యాలెస్ దారిలో.. బస్‌షెల్టర్లు కూల్చివేత



రుషికొండ ప్యాలెస్‌కు కొత్తగా రహదారి నిర్మాణం

విశాఖపట్నం/సాగర్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రుషికొండలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నిర్మాణం కోసం అధికారులు రెండు బస్ షెల్టర్లను కూల్చివేశారు. రుషికొండలో గీతం, గాయత్రీ విద్యా సంస్థలకు రోజూ పది వేల మందికిపైగా విద్యార్థులు, సిబ్బంది బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వీరి కోసం గీతం కాలేజీ ఎదురుగా ఒకటి, గాయత్రీ కాలేజీ ఎదురుగా మరొకటి బస్ షెల్టర్లు ఉండేవి. రుషికొండపై హరిత రిసార్ట్స్‌ను కూల్చివేసిన సమయంలోనే గీతం కాలేజీ బస్ షెల్టర్‌ను పడగొట్టి ఆ స్థలాన్ని ప్యాలెస్ నిర్మాణంలో కలిపేసుకున్నారు. మరికొద్ది రోజులకు గాయత్రీ బస్ షెల్టర్‌ను కూడా కూల్చేసి ఆ స్థానంలో రేకులతో ప్రహరీ ఏర్పాటుచేశారు. ఇప్పుడు రాత్రికిరాత్రి ఆ రేకులన్నీ తీసేసి రహదారి నిర్మాణం చేపట్టారు. సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో దానిని కూడా కలిపేశారు. ప్రత్యామ్నాయంగా ఆ పరిసరాల్లో ఎక్కడా కొత్త బస్‌షెల్టర్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

ప్రత్తిపాటి, ఇతరులను అరెస్టు చేయబోం



» హైకోర్టుకు హామీ ఇచ్చిన సీఐడీ అధికారులు

» పుల్లారావు, 'బీఎస్ఆర్'లను నిందితులుగా చూపలేదు

» మిగతా వారి పట్లా తొందరపాటు చర్యలుండవు: సీఐడీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో నిందితులు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులను అరెస్టు చేయబోమని సీఐడీ అధికారులు సోమవారం హైకోర్టుకు హామీ ఇచ్చారు. సీఐడీ తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు న్యాయస్థానం ఈ కేసుల విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఆదేశాలిచ్చారు. జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ ఏపీ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సీతారామిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజయవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి, కుర్రా జోగేశ్వరరావు, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు నాగమణి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఇండియా ఎండీ బలుసు శ్రీనివాసరావు వేర్వేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. సీఐడీ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసును పోలీసుల నుంచి సీఐడీకి బదిలీ చేశారన్నారు. రికార్డులను అధ్యయనం చేసి వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర, కిలారు నితిన్‌కృష్ణ, వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. పిటిషనర్లను అరెస్టు చేసే ప్రమాదం ఉందన్నారు. సీఐడీ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ... ప్రత్తిపాటి పుల్లారావు, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాను ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా చేర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో వారిని అరెస్టు చేస్తామనే ఆందోళన అవసరం లేదన్నారు. ఇతర పిటిషనర్ల విషయంలో సీఐడీ పోలీసులు అరెస్టుతోపాటు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోబోరని హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి... వాదనల కోసం విచారణను గురువారానికి వాయిదా వేశారు.

రాతపూర్వక వాదనలకు హైకోర్టు ఆదేశం

జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కస్టడీకి విజయవాడ ఫస్ట్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించడంపై పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. రాతపూర్వక వాదనలు సమర్పించాలని సీఐడీ, నిందితుడు శరత్ తరఫున న్యాయవాదులను న్యాయస్థానం ఆదేశించింది. అందుకు వీలుగా పోలీసులు వేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఆదేశాలిచ్చారు. బుధవారం తగిన ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. అంతకుముందు సీఐడీ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. "రాజధాని అమరావతి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనుల టెండర్‌ను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా చేజిక్కించుకుంది. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా అవెక్సా కంపెనీకి 'బీఎస్ఆర్' సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చింది. దీనికోసం అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్) నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా నుంచి అవెక్సాకు, అక్కడ నుంచి మరికొన్ని షెల్ కంపెనీలకు నిధులు మళ్లించారు. ఈ సమయంలో నిందితుడు అవెక్సా కంపెనీలో అదనపు డైరెక్టర్‌గా ఉన్నారు. మళ్లించిన నిధులు ఎక్కడకు చేరాయో తేల్చాలంటే లోతైన విచారణ అవసరం. ఈ నేపథ్యంలోనే శరత్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నాం" అని వివరించారు. శరత్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు స్పందిస్తూ.... ప్రైవేటు కంపెనీల మధ్య జరిగిన లావాదేవీలకు కుట్రకోణం ఆపాదించడంలో అర్థం లేదన్నారు. "రోడ్డు నిర్మాణం విషయంలో బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు, ఏడీసీఎల్‌కు మధ్య ఒప్పందం జరిగింది. రోడ్డు నిర్మాణం పూర్తి అయినట్లు అధికారులు నిర్ధారించారు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు అదనంగా ఎలాంటి సొమ్మూ చెల్లించలేదు. అవెక్సా కంపెనీ, ప్రభుత్వం మధ్య ఎలాంటి ఒప్పందమూ జరగలేదు. పనులు చేసిందనే కారణంతో కేసు పెట్టడం ఏమిటి? ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. పోలీసు కస్టడీని నిరాకరించాలి" అని వాదించారు.

ప్రత్తిపాటి శరత్ కేసులో సీఐడీకి ఝలక్

» మెమో రిటర్న్ చేసిన విజయవాడ కోర్టు

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కేసులో సీఐడీకి విజయవాడ కోర్టు ఝలక్ ఇచ్చింది. కేసును మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు నుంచి ఏసీబీ (మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్) కోర్టుకు బదిలీ చేయడానికి నిరాకరించింది. ఈ మేరకు సీఐడీ పీపీ సత్యనారాయణ, ఉమాదేవి దాఖలు చేసిన మెమోను కోర్టు రిటర్న్ చేసింది. సోమవారం కోర్టు ప్రారంభమైన తర్వాత సీఐడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఉమాదేవి మెమో దాఖలు చేశారు. ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారని, అందువల్ల దీన్ని ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలని మెమోలో పేర్కొన్నారు. దీనికి కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసును సీఐడీకి బదిలీ చేయడమన్నది డీజీపీకి, సీఐడీ అదనపు డీజీకి మధ్య జరిగిన అంతర్గత వ్యవహారమని వాదించారు. కేసు బదిలీ చేయాలంటే ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని స్పష్టంచేశారు. బెనర్జీ వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి కరీముల్లా...సీఐడీ దాఖలు చేసిన మెమోను రిటర్న్ చేశారు. ఆ తర్వాత సీఐడీ పీపీ సత్యనారాయణ సీఆర్పీసీ 322 కింద పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనా బెనర్జీ అభ్యంతరం తెలిపారు. నిందితుడికి పెద్దపెద్ద శిక్షలు పడే అవకాశం ఉందని నిర్ధారణ అయినప్పుడే కింది కోర్టు నుంచి పైస్థాయి కోర్టుకు కేసును బదిలీ చేస్తారన్నారు. అప్పుడు మాత్రమే సీఆర్పీసీ 322 సెక్షన్ వర్తిస్తుందన్నారు.

అనంతలో ఆరుగురు పోలీసుల డిస్మిస్

» అవినీతి, అక్రమాలు నిరూపణ కావడంతో చర్యలు

అనంతపురం క్రైం, మార్చి 11: పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురిని డిస్మిస్ చేశారు. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ సోమవారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డిస్మిస్ అయినవారిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు, జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. 2019లో తాడిపత్రి పట్టణంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుళ్లు రమణ, నాగరాజు, ప్రతాప్ నాయక్, మోహన్‌బాబు.. మట్కా, పేకాట నిర్వాహకులు, బీటర్లు, గంజాయి విక్రేతల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకునేవారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఐదుగురినీ అప్పట్లో సస్పెండ్ చేశారు. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో వారిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు. అలాగే, అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ జ్ఞానేశ్వరి చిట్టీలు నిర్వహించి ప్రజలను మోసగించారు. రూ.లక్షల్లో వసూలు చేసి ఎగ్గొట్టినట్లు విచారణలో తేలడంతో ఆమెను డిస్మిస్ చేశారు. తప్పు చేస్తే ఎవరినీ వదలబోమని ఎస్పీ పేర్కొన్నారు.

తిరుపతి నుంచి పలు రైళ్ల రద్దు

తిరుపతి సెంట్రల్, మార్చి11 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆధునీకీకరణ పనుల కారణంగా సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..


- పాండిచ్చేరి-తిరుపతి మధ్య నడుస్తున్న (16112-16111)రైళ్లను ఈనెల 24వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-మంగళూరు మధ్య నడుస్తున్న వారాంతపు రైలును (174070) ఈనెల 15 వరకు రద్దు చేశారు.
- తిరుపతి-అరక్కోణం మధ్య నడిచే (06753-06754), చెన్నై-తిరుపతి మధ్య నడుస్తున్న (06728-06727) ప్రత్యేక రైళ్లను తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 14వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-చెన్నై మధ్య నడుస్తున్న రోజువారి ఎక్స్‌ప్రెస్‌లు(16057-16058, 16054-16053) 23వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నాలుగు రైళ్లు రేణిగుంట-చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.
- నిజాముద్దీన్-త్రివేంద్రం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(12644) ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు తిరుపతికి రాకుండా రేణిగుంట నుంచి అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(12646) మంగళవారం నుంచి 19వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- బెంగళూరు నుంచి టాటానగర్, హటియాల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు 21వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తాయి.
- కాచిగూడ-మధురై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07191) ఈ నెల 18వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తుంది.

ఓట్ల కోసం సోషల్ మీడియాలో అబద్ధాల ప్రచారం

ఏపీ యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధులు జేడీ లక్ష్మీనారాయణ, విజయకుమార్




తిరుపతి, మార్చి11(ఆంధ్రజ్యోతి) : జైభారత్ నేషనల్ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ తెలుగు ప్రజా పార్టీ, ఏటీపీ పార్టీ, వీసీకే పార్టీలన్నీ కలసి ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా సోమవారం తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. విజయకుమార్ తిరుపతినుంచి పోటీచేయాలని తీర్మానం చేశారు. అనంతరం జేడీ లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో రాష్ట్రంలో యువతను పక్కదారి పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో ఖనిజాలు, ఇసుక ఇలా సహజ వనరులన్నింటిలోనూ దోపిడీ పెరిగిపోయిందని ఆవేదన చెందారు.అప్పులులేని, రౌడీయిజం లేని ఏపీకోసం తామంతా ఒకతాటిపైకి వచ్చి ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేశామన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దుర్మార్గుల నుంచి ప్రజలను కాపాడుకోవడానికి ఏపీ యునైటెడ్ ఫ్రంట్ పోరాడుతుందని చెప్పారు.ప్రభుత్వ నిర్ణయాలలో ప్రజల భాగస్వామ్యం పూర్తిగాలేదని చెప్పారు. సమస్యలపై ప్రజల గొంతుక వినపడాలంటే ఏపీ యునైటెడ్ ఫ్రంట్ అవసరమన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అబద్ధపు వార్తలను సోషల్ మీడియాలో ప్రసారం చేస్తున్నారన్నారు.ఓట్లకోసం సోషల్ మీడియాను వాడుకుంటున్నారన్నారు.యువతరం రాజకీయాల్లో లేకపోవడం కూడా ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటి దన్నారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్ యువతను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. సమాజంలో అసమానత పెరిగిపోయిందని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, రైల్వే జోన్లు వంటి వివిధ అంశాలపై స్పష్టత తీసుకునేలా ముందస్తుగా కేంద్రం నుంచి ఒప్పందం కుదుర్చుకోమని ఢిల్లీ చుట్టూ తిరిగే రాజకీయ పార్టీలకు చెప్పినా ఎవరూ వినలేదన్నారు. వారి స్వప్రయోజనాలే ముఖ్యంగా భావిస్తున్నారన్నారు. కేంద్రాన్ని నిలదీసే ధైర్యంలేని పార్టీలకు ఓటుద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఓటు అనే ఆయుధంతో యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విజయకుమార్ మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలు కుటుంబాల ద్వారా పార్టీలను నడిపిస్తున్నాయన్నారు.మూడవ ప్రత్యామ్నాయంగా ఏపీ యునైటెడ్ ఫ్రంట్ ఉంటుందన్నారు. ప్రజాధనాన్ని ప్రజల కోసం, అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సివుండగా ప్రస్తుతం వివిధ రూపాల్లో డబ్బును పంచుతూ ఓట్లరాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆల్ తెలుగు ప్రజా పార్టీ అధ్యక్షుడు శివభాగ్యరావు, వీసీకే పార్టీ ప్రతినిధులు పరమశివన్, డాక్టర్ ప్రభు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచవ్యాప్తంగా ప్రతి వంద మందిలో పది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇందుకు కారణం మూత్రపిండాల వ్యాధుల పట్ల తగినంత అవగాహన లేకపోవడమే! కాబట్టి మూత్రపిండాల సంరక్షణ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం అవసరం.

కిడ్నీలు కీలకం

కిడ్నీలు రక్తాన్ని వడగట్టి, వ్యర్థాలను శరీరం నుంచి తొలగిస్తాయనే విషయం అందరికీ తెలిసిందే! ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసే హార్మోన్లు, ఎములక పెరుగుదలకు ఉపయోగపడే డి విటమిన్ తయారీపరంగా కిడ్నీలు తోడ్పడతాయి. రక్తపోటును నియంత్రణలో ఉంచుతూ గుండె సక్రమ పనితీరుకు సహాయపడతాయి. అలాగే శరీరంలోని, క్యాల్షియం, పొటాషియం మొదలైన పోషకాల నియంత్రణలో కూడా సహాయపడతాయి.



లక్షణాలు ఇవే!

- నురగతో కూడిన మూత్రం
- తరచూ లేదా ఆగి ఆగి మూత్రవిసర్జన చేయడం
- మూత్రంలో రక్తం
- ఆకలి మందగించడం, వికారం, వాంతులు
- త్వరగా అలసిపోవడం
- చర్మం పొడిబారి, దురదగా ఉండడం

కిడ్నీలు దెబ్బతినే అవకాశాలు ఇవే!

- మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బుల సమస్యలు ఉన్నవాళ్లలో మూత్రపిండాల సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ.
- ఊబకాయులు, అరవై ఏళ్ల పైబడినవాళ్లు, ధూమపానం అలవాటు ఉన్నవాళ్లకు కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఎక్కువ
- దీర్ఘకాలం పాటు పెయిన్ కిల్లర్స్, ఇన్సులిన్ వాడేవాళ్లకు కూడా ముప్పు పొంచి ఉంటుంది.
- కిడ్నీలో రాళ్లు, దీర్ఘకాలిక మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు మూత్రపిండాల వ్యాధికి దారి తీస్తాయి

కిడ్నీ వ్యాధి నిర్ధారణ ఇలా...

మూత్రపిండాల వ్యాధిని ముందుగానే కనిపెట్టడం కోసం క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రం కాకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. మూత్రపిండాల వ్యాధిని నిర్ధారించే పరీక్షల ఖర్చు తక్కువే! రెండు పరీక్షలతో వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

- మూత్రంలో ప్రొటీన్‌ను పసిగట్టే పరీక్ష ప్రధానమైనది. మూత్రంలో తక్కువ ప్రొటీన్ పోవడం మూత్రపిండ వ్యాధికి సంకేతం. యూరిన్ ఆల్బ్యుమిన్ క్రియాటినిన్ రేషియో పరీక్ష ద్వారా కిడ్నీ సమస్యను కనిపెట్టవచ్చు.
- కిడ్నీలో రక్తం ఏ మేరకు శుద్ధి అవుతుందో తెలిపే పరీక్ష జిఎఫ్ఆర్ పరీక్ష. ఈ పరీక్షతో కిడ్నీ పనితీరు తెలుస్తుంది. ఈ రెండు పరీక్షల్లో అవకతవకలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

కిడ్నీ కేర్

- మధుమేహం, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను, మూత్ర వ్యవస్థలో సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో కూడిన సంతులన ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయడంతో పాటు, సరిపడా విశ్రాంతి తీసుకోవాలి
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.

ఇవి కూడదు

- మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఉప్పును పరిమితంగా వాడుకోవాలి.
- ధూమపానం కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యను పెంచుతుంది. కాబట్టి ఈ అలవాటు మానుకోవాలి
- వైద్యులు సూచించకపోయినా పెయిన్ కిల్లర్స్ వాడుకోకూడదు
- ఆరోగ్యానికి హాని చేసే పసరు మందులు వాడకూడదు
- తరచూ అధిక ప్రొటీన్‌తో కూడిన రెడ్ మీట్, ప్రాసెస్డ్ ఫుడ్ తినకూడదు

డయాలసిస్ - కిడ్నీ మార్పిడి

కిడ్నీ వ్యాధి ఉన్న ప్రతి ఒక్కరికీ డయాలసిస్ అవసరం ఉండదు. వ్యాధి ప్రారంభ దశలో సమర్థమైన చికిత్స, వ్యాయామం, ఆహారంతో వ్యాధి ముదరకుండా, అదుపులోకి తెచ్చుకోవచ్చు. క్రియాటిన్ పెరుగుదలను మందులతో అరికట్టవచ్చు. వ్యాధి తీవ్రత పెరిగి కిడ్నీలు పూర్తిగా పని చేయడం మానేసినప్పుడు మాత్రమే డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమవుతుంది. సరైన జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించగలిగితే, డయాలసిస్‌తో సగటు ఆయుర్దాయం 15 నుంచి 20 సంవత్సరాల వరకూ పెరిగిన దాఖలాలు ఉన్నాయి. అయితే మూత్రపిండాల వ్యాధికి డయాలసిస్ నివారణ కాదు. మూత్రపిండాల మార్పిడి చేసుకునేవరకూ డయాలసిస్ మీద ఆధారపడక తప్పదు. అయితే కిడ్నీ మార్పిడి క్లిష్టమైన వ్యవహారం. సరైన డోనార్ దొరికే వరకూ ఎదురుచూడవలసి ఉంటుంది. కాబట్టి మూత్రపిండాలు వ్యాధులకు గురి కాకుండా కాపాడుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. మధుమేహులు, అధిక రక్తపోటు ఉన్నవారు, 50 ఏళ్లు పైబడినవాళ్లు, గుండె జబ్బులు ఉన్నవాళ్లు, ఊబకాయులు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి.

డాక్టర్ హిమదీప్తి ఆళ్ల
నెఫ్రాలజిస్ట్ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్,
ఎరిటి హాస్పిటల్స్, గచ్చిబౌలి, హైదరాబాద్.

షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కొంతమంది తటపటాయిస్తూ ఉంటారు. లేదంటే చేతులు తుడుచుకుని ఆ తర్వాతే షేక్ హ్యాండ్ ఇస్తూ ఉంటారు. విపరీతంగా చమట పడుతూ చేతులు తడిగా ఉండడమే ఇందుకు కారణం. అర చేతులు, పాదాలు, బాహుమూలలు, ముఖం, తల... ఈ ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టే పరిస్థితి 'హైపర్ హైడ్రోసిస్'. దీన్ని చిన్నపాటి సర్జరీతో సరిదిద్దవచ్చు అంటున్నారు వైద్యులు.



హైపర్ హైడ్రోసిస్

చమటలో తడిచిపోతున్నారా?

మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్... ఈ సమస్యలున్న కొందర్లో చమట ఎక్కువగా పడుతూ ఉంటుంది. ఈ సమస్యలేవీ లేని కొందర్లో, అకారణంగా విపరీతంగా చమట పట్టే పరిస్థితి ఉంటుంది. ఆ చమట చుక్కలుగా కారేటంత తీవ్రంగా ఉంటుంది. వాతావరణంలో స్వల్ప మార్పు చోటు చేసుకున్నా, ఆందోళన, ఒత్తిడులకు గురైనా కొందరికి విపరీతంగా చమట పడుతూ ఉంటుంది. ఈ పరిస్థితి ఏకంగా ఒకటి నుంచి రెండు గంటల పాటు కొనసాగుతూ ఉంటుంది. 20 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఎదుర్కొనే ఈ సమస్య ప్రమాదకరమైనది కాకపోయినా, దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెడుతూ ఉంటుంది. నడుస్తున్న బస్సెక్కబోతూ చమట పట్టిన చేతి నుంచి హ్యాండిల్ జారిపోయి కిందపడిపోతూ ఉంటారు. పరీక్ష రాసేటప్పుడు అరచేతుల్లో అధిక చమట వల్ల ఆన్సర్ పేపర్ తడిచిపోయే పరిస్థితి వస్తూ ఉంటుంది. ఐది ఉద్యోగులు ఉద్యోగరీత్యా ప్రెజెంటేషన్ సమయంలో అందరికీ షేక్ హ్యాండ్ ఇవ్వవలసి వస్తూ ఉంటుంది. కానీ అరచేతుల్లో చమట కారణంగా షేక్‌హ్యాండ్ ఇవ్వలేక, ఉద్యోగమే పోగొట్టుకునే పరిస్థితిని ఎదుర్కొనే వాళ్లూ ఉంటారు.

హైపర్ హైడ్రోసిస్

అధిక చమటకు మూలకారణాన్ని కనిపెట్టడం ముఖ్యం. అధిక రక్తపోటు, థైరాయిడ్, మధుమేహం కారణమైతే, వాటిని మందులతో అదుపులో పెట్టుకుంటే సమస్య సర్దుకుంటుంది. ఇవేవీ కారణం కానప్పుడు, హైపర్ హైడ్రోసిస్‌గా నిర్ధారించుకోవాలి. కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరికొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. అరుదుగా కొందరికి ఈ నాలుగు ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. ఈ పరిస్థితికి కారణమైన నాడులు పక్కటెముకల దగ్గర ఉంటాయి. చిన్నపాటి సర్జరీతో వాటి పనితీరును నియంత్రించడం ద్వారా అధిక చమట సమస్యను సరిదిద్దవచ్చు.

ప్రధాన దుష్ప్రభావాలు

సర్జరీతో అరచేతుల్లో చమటను ఆపేసినప్పుడు, తొడ వెనక ఎక్కువగా చమట పట్టే అవకాశాలు కొందర్లో ఉంటాయి. సర్జరీ తర్వాత కొందర్లో నెల వరకూ అధిక చమట కొనసాగి, క్రమేపీ తగ్గిపోవచ్చు. అలాగే అధిక చమటకు ఆస్కారం ఉండే ఆందోళన, భయాలు, ఒత్తిడులను కూడా తగ్గించుకోవాలి.

డాక్టర్ మంజునాథ్ బాలే
సీనియర్ మినిమల్లీ ఇన్వేసివ్ అండ్ రోబోటిక్ థొరాసిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.



సింపథెక్టమీతో...

ఇది ఒక్క గంటలో పూర్తయ్యే తేలికపాటి సర్జరీ. ఉదయం సర్జరీ చేయించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోవచ్చు. పక్కటెముకల దగ్గర ఐదు మిల్లీమీటర్ల రంధ్రాలు చేసి కెమెరా సహాయంతో సదరు ప్రాంతంలో చమట పట్టడానికి కారణమైన నాడికి క్లిప్ వేయడం జరుగుతుంది. ముఖం, తల, చేతులు, పాదాల్లో చమటను నియంత్రించడానికి వెన్నులో రెండవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాలు, బాహుమూలల్లో చమటను నియంత్రించడం కోసం మూడవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాల్లో చమట నియంత్రణ కోసం నాల్గవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, కేవలం పాదాల్లో చమటను నియంత్రించడం కోసం ఐదవ పక్కటెముక దగ్గరున్న నరానికీ క్లిప్ వేయవలసి ఉంటుంది. సర్జరీ తర్వాత కొందరికి అరచేతులు బాగా పొడిబారిపోవచ్చు, కానీ పాదాల్లో చమట కొంత మేరకు కనిపిస్తూ ఉండవచ్చు. పాదాల్లో చమటను నియంత్రించడానికి నరానికి బలంగా క్లిప్ వేస్తే, వాళ్లకు వెన్నులో ఎక్కువగా చమట పట్టే పరిస్థితి మొదలవుతుంది. కాబట్టి వైద్యులు చేతుల్లో చమటను తగ్గించడమే ప్రధానంగా సర్జరీ చేస్తారు.





కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరి కొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది.

ప్లానింగ్

పెళ్లికి ముందు పరీక్షలు

పెళ్లికి ముందు అటు ఆరు తరాలూ, ఇటు తరాలూ గమనించాలి అంటారు. పెళ్లి నూరేళ్ల పంటగా వర్థిల్లడం కోసమే ఈ ముందు జాగ్రత్తలు. అయితే దంపతుల ఆరోగ్యాలతో పాటు, పిల్లలు పుట్టే అవకాశాలు, జన్యుపరంగా సంక్రమించే వ్యాధులు లాంటి వివరాలను కూడా ముందుగా తెలుసుకోవడం కూడా అవసరమే! అందుకోసం పెళ్లి చేసుకోబోయే జంట కొన్ని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. అవేంటంటే...



రక్తపరీక్షలు:

అనీమియా లాంటి అంతర్గత ఆరోగ్య సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు తెలుసుకోవడం కోసం ఈ పరీక్ష చేయించుకోవాలి.
ఈ పరీక్షతో ఇద్దరి బ్లడ్‌గ్రూప్ కూడా తేటతెల్లమవుతుంది.

జెనెటిక్ స్క్రీనింగ్:

వంశపారంపర్యంగా సంక్రమించే జన్యు సమస్యలు, ముప్పులను ఈ పరీక్షతో పసిగట్టవచ్చు. ఈ పరీక్ష ఫలితాన్ని బట్టి దంపతులు పిల్లల ప్లానింగ్ చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ముందు జాగ్రత్తలు, చికిత్సలను ఆశ్రయించవచ్చు.

ఎస్‌టిఐ:

లైంగికంగా సంక్రమించే కొన్ని వ్యాధులు శాశ్వత వంధత్వాన్ని తెచ్చిపెడతాయి. కాబట్టి పెళ్లికి ముందు ఈ పరీక్ష తప్పనిసరిగా చేయించుకుని, అవసరాన్ని బట్టి చికిత్స తీసుకోవాలి.

ఫెర్టిలిటీ పరీక్షలు:

పునరుత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు ఇద్దరూ చేయించుకోవాలి. స్త్రీలల్లో అండాశయాలు, గర్భాశయ లోపాలు, పురుషుల్లో వీర్యకణాలు, కదలికల వివరాలు ఈ పరీక్షతో తెలుస్తాయి. లోపం ఎవరిలో ఉన్నా చికిత్సతో సరిదిద్దుకుంటే, తర్వాత పిల్లలను కనడంలో ఎలాంటి సమస్యలూ ఎదురవకుండా ఉంటాయి.

మీకు తెలుసా?


పాప్‌కార్న్ బ్రెయిన్

మొక్కజొన్న గింజలను వేయించేటప్పుడు అవి చిన్నపాటి టపాసుల్లా పేలుతూ చెల్లాచెదురుగా ఎగిరి పడిపోతూ ఉంటాయి. అదే పనిగా ఇంటర్నెట్, సోషల్ మీడియా ఉపయోగించే వాళ్ల ఆలోచనలు కూడా పాప్‌కార్న్‌లా ఒక దగ్గరి నుంచి ఇంకో దగ్గరకి ఎగిరి పడుతూ ఉంటాయి.



ఈ పరిస్థితినే పాప్‌కార్న్ బ్రెయిన్ అంటారు. ఈ స్థితికి చేరుకున్న వారి సామాజిక అనుబంధాలు దెబ్బతింటాయి. సహనం తగ్గడంతో పాటు మానసిక సంతులనాన్ని కూడా కోల్పోతారు.
ఆందోళన పెరిగి ఉత్పాదకత కూడా తగ్గుతుంది. దేని మీద మనసు కేటాయించలేకపోవడం, అప్రమత్తత లోపించడం కూడా పాప్‌కార్న్ బ్రెయిన్ లక్షణాలే! ఈ పరిస్థితి వృత్తిపరమైన, వ్యక్తిగతమైన జీవితాలను దెబ్బతీస్తుంది. కాబట్టి ఇంటర్నెట్, సోషల్ మీడియా వాడకాలను పరిమితం చేసుకోవాలి.

అవగాహన



ఆ గీతకు అర్థం?

మందుల స్ట్రిప్‌ల మీద అడ్డుగా ఉండే ఎర్రని గీతను ఎప్పుడైనా గమనించారా? అలాంటి గీతలను చాలా మందుల స్ట్రిప్‌ల మీద చూశాం కదా? దాన్లో విచిత్రమేముంది? అనుకోకండి. ఆ గీతకు ఒక అర్థం ఉంది. యాంటీబయాటిక్స్ విచక్షణా రహితంగా వాడడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరుగుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పటి నుంచో గగ్గోలు పెడుతోంది. ఈ పరిస్థితి సూక్ష్మజీవుల మ్యుటేషన్‌కు దారి తీస్తుందనీ, మందులకు లొంగని వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల సంఖ్యను పెంచుతుందని మనందరికీ తెలుసు. కాబట్టే వైద్యులు సూచించినప్పుడు, సూచించినంత కాలం మాత్రమే యాంటీబయాటిక్స్ వాడుకోవాలి. ఈ మందులను తేలికగా గుర్తించడం కోసమే యాంటిబయాటిక్స్ స్ట్రిప్‌ల మీద ఎర్రని గీతను ముద్రిస్తూ ఉంటారు. ఈ గీత ఆధారంగా మందుల షాపుల్లో విక్రయించే యాంటీబయాటిక్స్‌ను తేలికగా గుర్తించవచ్చు. తలనొప్పి, జలుబు లాంటి స్వల్ప రుగ్మతలకు ఓవర్ ది కౌంటర్ మెడికేషన్ కొనే సమయంలో అవగాహన లేమితో యాంటీబయాటిక్స్‌ను కొనేసి విచక్షణారహితంగా వాడకుండా ఉండడం కోసమే ఈ ఏర్పాటు.

రంజాన్

పవిత్ర మాసంలో నిండైన ఆరోగ్యం

ముస్లిం క్యాలెండర్‌లో తొమ్మిదో నెల రంజాన్ మాసాన్ని ఏడాది మొత్తంలో ఎంతో పవిత్రమైన నెలగా పరిగణిస్తారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తం ముస్లింలు అందరూ ఉపవాసం ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే! రోజాలో ఉన్నప్పుడు, తెల్లవారు ఝాము నుంచి పొద్దు కుంగేవరకూ ఉపవాసం చేసే సమయంలో ఆరోగ్యం దెబ్బ తినకుండా ఉండడం కోసం ప్రతి ఏటా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ముస్లింలకు కొన్ని ఆహార నియమాలను సూచించడం పరిపాటి. అవేంటంటే...

సంతులన భోజనం
ఉపవాసానికి ముందూ, తర్వాత సంతులన ఆహారం తీసుకోవడంతో పాటు నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉపవాసం ముగిసిన తర్వాత వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

ఉప్పు ఇలా
పదార్థాల్లో ఉప్పుకు బదులుగా మూలికలను చేర్చుకోవాలి. సహజసిద్ధమైన మూలికలు ఆహారం రుచిని పెంచడంతో పాటు, ఆరోగ్యాన్ని సమకూరుస్తాయి.

శారీరక వ్యాయామం
ఉపవాసంలో ఉంటున్నప్పటికీ వ్యాయామాన్ని మానవలసిన అవసరం లేదు. వ్యాయామంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉండడంతో పాటు, ఆరోగ్యం కూడా భేషుగ్గా ఉంటుంది.

వంట ఇలా
ఆహారంలోని పోషకాలను నష్టపోకుండా ఉండడం కోసం, పదార్థాలను నూనెలో వేయించడానికి బదులుగా, బేక్ చేయడం ఆవిరి మీద ఉడికించడం చేయాలి.

